
జీవనంలో నవ్వు
నవ వసంతం!
ఈ నూతన సంవత్సరంలో
మీ జీవనం నవ వసంతంలా
కళ కళ లాడుతూ ఉండాలని
ఉగాది శుభాకాంక్షలు
హాస్యానందం



# హాస్యానందం

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఏప్రిల్-2024

వెల: ₹20



బంగార్తల్లి పురస్కారం 2024



ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ ఫలితాలు

NORTH COASTAL ANDHRA CARTOONISTS FORUM VISAKHAPATNAM

NCCF విశాఖపట్టణం వారు నిర్వహించిన కార్టూన్ పోటీ ఫలితాలు

## జీవనంలో నవ్వు నవ వసంతం!

హాస్యానందం పాఠకులకు ప్రత్యేకం

శ్రీ క్రోధినామ సంవత్సర గ్రహచారాల ఫలితాలు

# ఆహ్వానము



మా మాతృమూర్తి
దివ్యశ్రీ జాంబువతి గారిని స్మరిస్తూ
ప్రతి ఉగాదికి హాస్యానందం అందించే
వార్షిక పురస్కారం

## బంగార్తల్లి పురస్కారం

10,000 రూపాయల నగదు బహుమతి, జ్ఞాపిక, సన్మాన పత్రం



పుస్తక సేవలో తరిస్తున్న సాహితీ సేవకురాలు
**శ్రీమతి భావరాజు పద్మినీ ప్రియదర్శిని గారి,**
నైపుణ్యానికి, సమర్థతకి ఆనందాభివందనాలతో...
**బంగార్తల్లి పురస్కారం-2024**
అందజేస్తున్నాం!



పాలపర్తి రాజగోపాల్,
ఉమాదేవి స్మారక
ఉగాది కొసమెరుపు
మినీ హాస్య కథల పోటీలో
విజేతలకు బహుమతి ప్రదానోత్సవం!

**NCCF**
విశాఖపట్టణం వారు
నిర్వహించిన
కార్టూన్ పోటీలో విజేతలకు
ప్రదానోత్సవం!

## ముఖ్య అతిథులు

**శ్రీ కె.ఎస్.రామారావు,** డెప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి,
శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం, విజయవాడ

**శ్రీ టి.శ్రీనివాసు,** సెక్రటరీ & కరస్పాండెంట్,
కె.బి.ఎన్.కాలేజి, విజయవాడ

**శ్రీ ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ,** సెక్రటరీ,
సాహితీ సమాఖ్య, గుంటూరు

**శ్రీ వెంకటనారాయణ ,** పల్లవి పబ్లికేషన్స్

**శ్రీ సరసి,** ప్రముఖ కార్టూనిస్టు

**శ్రీమతి బాలాంత్రపు ప్రసూన,** సాహితి విమర్శకురాలు

**శ్రీ బాచి ,** ప్రముఖ కార్టూనిస్టు

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణ ,** హాస్యానందం ఆప్తబంధువు

**శ్రీ పాలపర్తి శ్రీకాంత శర్మ,** కథల పోటీ నిర్వాహకులు

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 4వ అంతస్తు
శ్రీ & శ్రీమతి కె.ఎస్‌రావు,శేషుమాంబ,ఎమెస్కో సాహిత్య వేదిక, విజయవాడ

ఏప్రిల్ 14 2024

ఆదివారం,
సాయంకాలం 6గంటలకు

జీవనంలో నవ్వు నవ వసంతం!

# హాస్యానందం

ఏప్రిల్-2024

21వ సంవత్సరం
238 వ సంచిక

**Publisher& Editor- Ramu.P**



**Full Pillar** : Bnim

**Cartoon Feature Editor**: Bachi

**Creative Team**
Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar,
Gandhi,
Nagisetty,
GopalKrishna,
Bomman
Sangram,
Krishna

**D.T.P:** P. Ramalakshmi,
9440304993

**Digital Media Director:**
Surya

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga, **Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.





ముఖచిత్రం:
ప్రకృతి కన్య


**Well Wishers:**
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

**Prize Sponsers**
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya & Satyavathi
Md.Raj Mohammed
Srikanth Sarma
NCCF



సంవత్సర చందా-రూ.300/- (పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/- (పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**
(రిజిస్టర్ పోస్ట్‌లో)



Editorial Office:

**HASYANANDAM**, # 8-215/4, Near Ramalayam, **Po:YERRABALEM-522 502**
Mangalagiri Mandal, Guntur dist. *Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com** ✦ web: **www. hasyanandam.com**


Smile in Every Page...Satisfaction in Every Smile


**గమనిక:** ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.




## పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు



| | | |
|---|---|---|
| ఎప్పుడు పడితే అప్పుడు | -సరసి | -16 |
| సుకుమారి స్పృహ కోల్పోయింది | -కోనే నాగ వెంకట ఆంజనేయులు | -17 |
| సాక్ష్యం కావాలా? | -పోలప్రగడ జనార్దనరావు(జెన్ని) | -18 |
| రెండోఇల్లు | -పెనుమాక నాగేశ్వరరావు | -19 |
| గోతిలో కాదు, నూతిలో | -గంగాధర్ వడ్లమన్నాటి | -20 |
| ముందు చూపు | -తెలికిచెర్ల విజయలక్ష్మి | -21 |
| డిసీజ్ మై ఛీటింగ్ ! | -గాంధీ మనోహర్ | -22 |
| బస్సు జర్నీ | -కొమ్ముల వెంకట సూర్యనారాయణ | -23 |
| భలే దంపతులు | -పద్మావతి దివాకర్ల | -24 |
| న్యూట్రెండ్ | -శింగరాజు శ్రీనివాసరావు | -25 |
| సహన జీవి | -పీవీ రమణ కుమార్ | -26 |
| టికెట్ ఫ్రీ | -పావులూరి శివాజీ | -27 |
| బారు-రౌండ్లు | -డి.వి.డి.ప్రసాద్ | -28 |
| హన్నన్నా | -లక్ష్మీ గాయత్రి | -29 |
| అదొక్కటే | -ఈత కోట సుబ్బారావు | -30 |
| ముఖాలు చూసుకుందాం! | -సి.ఎన్.చంద్రశేఖర్ | -31 |
| సీరియల్ కిల్లర్ | -డాక్టర్ ఎమ్.సుగుణ రావు | -32 |
| కళ్యాణం చూతము రారండి! | -దాసరి చంద్రయ్య | -33 |
| చేదు పచ్చడి | -కొత్త ప్రియాంక(భానుప్రియ) | -34 |
| షరతు | -కట్టా రాంబాబు | -35 |












NCCF, విశాఖపట్నం వారు నిర్వహించిన కార్టూన్ల పోటీలో బహుమతి పొందిన కార్టూన్లు — 42 నుండి 46

**శీర్షికలు**

| | | |
|---|---|---|
| వాక్చిత్రం | -సుధామ | -36 |
| స్మైల్ స్టార్స్ | -ప్రసిద్ధ | -38 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -40 |
| పదానందం | -పోపూరి విశ్వనాథ్ | -50 |

**కార్టూన్ కథలు**

| | | |
|---|---|---|
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -12 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -13 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -48 |

ఈనెల ప్రత్యేకం: శ్రీ క్రోధి నామ సంవత్సర గ్రహచారాల ఫలితాలు

యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి **కొంగుచాటు కృష్ణుడు** సీరియల్! 10

47 కండ్లకుంట శరత్‌చంద్ర **ఇందు చందు-నవ్వులవిందు** సీరియల్!



# గెస్ట్ ఎ మినిట్


**హా**స్యానందం పత్రిక తొలి నుంచీ జీవిత చందాదారుల్లో నేను ఒకడిని. రొటీన్ జీవితాలతో సీరియస్‌గా ఉండే పాఠకులు కాస్త రిలాక్స్ అవటానికి దోహద పడుతున్న రాముగారు అభినందనీయులు. దానికన్నా ముఖ్యంగా... పోటీలు పెట్టి, స్పాన్సర్ల నుంచి ఆర్థిక రూపేణా బహుమతులు ప్రకటించి కార్టూనిస్టులకి అంతో ఇంతో ఆర్థిక సహాయం చేస్తున్నవారు!
మరో రకంగా చెప్పాలంటే, శ్రమని గుర్తించి, కాసింతైనా ప్రోత్సాహం ఇస్తున్న పత్రిక తెలుగులో ఇదొకటే!
ప్రస్తుతం వారు, వారి తల్లి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రచురణ రంగంలో ఉన్న ఒక మహిళకి 'బంగారు తల్లి' పురస్కారాన్ని ఇస్తున్నారు.
గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న ఈ యజ్ఞంలో ఈ సంవత్సరం భావరాజు పద్మినీ ప్రియదర్శిని గారిని ఈ పురస్కారానికి ఎన్నుకున్నారు. పబ్లిషింగ్ రంగంలో ఉండే మహిళలకు ప్రోత్సాహం ఇచ్చే అత్యున్నత పురస్కారం ఇది. ఈ సందర్భంగా ఆయనకీ, హాస్యానందానికీ, బహుమతి గ్రహీతకీ అభినందనలు.

**-యండమూరి వీరేంద్రనాథ్**




✦ **పి.వి.మధు నివ్రితి, సికింద్రాబాద్**

**ము**ఖచిత్రం మీద 'నవ్వుల విందు' హాస్యానందం పత్రిక అని... బాగా సెలవిచ్చారు. అట్ట మీద కార్టూన్ కాస్త మీ GPS లొకేషన్ ఇస్తారా అని యమకింకరులు అడగటం చాలా సృజనాత్మకంగా ఉన్నది. పదానందం మా ఫేవరేట్. మెదడుకు మేత. స్మైల్‌స్టార్‌లో కార్టూనిస్ట్ కృష్ణ గారి పెద్దనాన్నగారు బాపు అని తెలుసుకొని ఆశ్చర్య పోయాము. రక్త సంబంధాల గుణాలు అంటే ఇదేనేమో! ఈనెల అంశం 'కాలం' కార్టూన్లు ఒకదాన్ని మించినది ఇంకోటి... అందరూ అందరే! చాలా బాగుంది. వినూత్నంగా ఉన్నాయి. సంపాదకత్వంలో అందరినీ గౌరవంగా చూడాలి... కనీసం తక్కువగా చూడవద్దు అన్నమాట... (సమావేశాల్లో, సభల్లో, ఇళ్ళల్లో) ఇది చిన్న సంతోషపూరిత నిర్వహణ (MBA) పాఠంలా ఉన్నది... లేకుంటే రగిలే హృదయాలకు తావు ఇస్తుంది. మనిషి ఎన్నటికీ కించ పరచడం మరిచి పోడు. అది మానవ నైజం. మండే గుండెలు ఇవ్వకుండా హాస్యానందంగా జ్ఞానం-విజ్ఞానంగా జీవించాలి. ఆరోగ్యంతో పాటు ఆయుష్షు పెరుగుతుంది. వద్దన్నా, అందరూ స్నేహితులే అన్నట్టు జీవితం సాగుతుంది.




✦ **కె.వి.రామలక్ష్మి, ముంబై**

**మా**ర్చి హాస్యానందంలో 'వాక్చిత్రం' శీర్షికలో ప్రచురించిన 'నాటీ నైటీ బ్యూటీ డ్యూటీ' చాలా బాగుంది. నైటీల వాడకం ఈ మధ్య ఎలా ఉందో చాలా చక్కగా చెప్పారు సుధామగారు. ఎక్కడ ఎవరినీ కించ పరచకుండా సున్నితమైన చురకలతో అందించిన ఈ వ్యాసం పరిణతి గల రచయిత రచనకు ఉదాహరణ! ముఖ్యంగా నైటీతో ముగ్గు వేస్తున్న అతివ మోడ్రన్ మహిళకు మోడల్‌లా ఉంది. ఈ సంచికలో ప్రచురించిన 8 కథలు బావున్నాయి. మీ కృషికి అభినందనలు.

✦ **ఆర్.శ్రీకాంత్, హైదరాబాద్**

**హా**స్యానందంలో ప్రతినెలా 'హాయ్ సానందంగా' ఎడిటర్‌గారు, ఆనందానికి మూలమైన చిన్న చిన్న విషయాలు చాలా చక్కగా చెప్తున్నారు. మనం చాలా సందర్భాల్లో నిర్లక్ష్యం చేస్తున్న ఇవి ఆనందానికి అటూ ఇటూ ఉన్న కారణాలు! కొత్తగా మొదలయిన 'కొంగుచాటు కృష్ణుడు' సీరియల్ సున్నితమైన హాస్యంతో చాలా బాగుంది.

✦ **జి.భాగ్యలక్ష్మి, నెల్లూరు**

**మా**ర్చి నెలలో ప్రచురించిన కథలన్నీ బావున్నాయి. కార్టూన్లన్నీ కూడా నవ్వించాయి. ముఖ్యంగా 'స్మైల్‌స్టార్' కృష్ణ కార్టూన్లు... కార్టూన్లు ఎలా ఉండాలో తెలియజెప్పిందంటే నమ్మండి! చురకలంటిస్తూనే నవ్వించిన ఈ కార్టూన్లు సూపర్. అలాగే 'తెలుగా మజాకా?' మనం తెలుగులో చేస్తున్న పొరపాట్లను నవ్వుల పూతతో అందిస్తున్న రామకృష్ణగారికి అభినందనలు.

**ఆనందం ఎవరికి వద్దు చెప్పండి!**

**మా**ర్చి నెల హాస్యానందం సంపాదకీయంలో రాముగారు సభల గురించి చాలా విషయాలు చెప్పారు. సభలు జరిపే వారు ఆహ్వానం పలికి వచ్చిన వారిని పట్టించుకోకపోవడం చాలా సందర్భాల్లో చూసాం. చూస్తున్నాం. అలాగని వచ్చిన వారికి అల్పాహారం పెట్టి కాఫీలు టీలు ఇమ్మని కాదు... ఆహ్వానించబడ్డ వారిని నవ్వుతూ పలకరిస్తే చాలు ఆనంద పడిపోతారు.

ఈ మధ్య వేదిక మీద మాట్లాడే ముఖ్య అతిథులు కూడా మాకు అవతల బోలెడు పనులున్నాయి ముందు నన్ను మాట్లాడనివ్వండంటూ మాట్లాడేసి కప్పిన శాలువా, ఇచ్చిన జ్ఞాపకా తీసుకుని వెళ్ళిపోతున్నారు. ఇలా మధ్యలో వెళ్లిపోవడం ఎంతవరకు సబబు? ఎంతో దూరం నుండి కేవలం వాట్సప్ మెసేజీలు చూసి సభలకు వచ్చే శ్రోతలు ఇలాంటి గజిబిజి చూసి సభలకు రావడం మానేస్తారు.

సమయానికి మొదలవని సభల వల్ల కూడా... చాలా ఇబ్బందులు కలుగుతుంటాయి. అంతా వస్తారు ముఖ్యఅతిథి గంట లేటుగా వస్తారు. దూరప్రాంతాలకు వెళ్లే వాళ్లకు బస్సులు అందక పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ సంపాదకీయం చదివి నిర్వాహకులు సభా నిర్వహణలో మార్పులు చేసుకుంటే అందరికీ బాగుంటుంది.

ఆనందం ఎవరికి వద్దు చెప్పండి!

**-డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు, విజయవాడ**

✦✦✦

**సమానంగా చూసే ప్రయత్నం చేయాలి!**

**మా**ర్చి హాస్యానందంలో.... 'హాయ్‌సానందంగా' విషయం ఎంతో ఆలోచింపజేసే విధంగానూ, ఒక ముఖ్యవిషయం మనకి జ్ఞప్తికి తెచ్చేలా, నేర్పేలా ఉందనడంలో సందేహం లేదు. సభలకి, సమావేశాలకి విచ్చేసే ముఖ్యులతో పాటు విచ్చేసిన ఆహుతులను కూడా సమానంగా చూసే ప్రయత్నం చేయాలని అభి ప్రాయపడ్డారు. సభ నిర్వహించడవే గొప్ప సాహిత్య సేవ అనుకుని, వాళ్ళకి వాళ్ళే మురిసి ముద్దయిపోవడం కూడా దీనికి ఓ కారణం. నేను వెళ్ళిన కొన్ని సభల్లో కూడా నాకు ఇలాంటి అనుభవాలు ఎదుర య్యాయి. 'అందరినీ ఎలా గౌరవిస్తాం... అదెలా సాధ్యమవుతుంది' అని ఎదురు ప్రశ్న వేయొచ్చు. సభకి/ సమావేశానికి విచ్చేస్తున్న వారు ఒక్కొక్కరుగా వస్తారు తప్ప ఒకేసారి వందమంది రారు కదా! అలా ఒక్కొక్కరు వస్తున్నప్పుడు గుమ్మం వద్ద నిలబడి, వచ్చిన వారిని ఆహ్వానించగలగాలి. అది వీలు పడకపోతే సభకి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు అని చెప్పి, వాళ్ళని ఉద్దేశించి కనీసం ఒకటి రెండు నిమిషాలు అయినా మాట్లాడితే... వచ్చినవారు, వారిని పట్టించుకున్నారన్న ఓ చిన్న 'ఆనందం' పొందుతారనేది నిజం!

**-వల్లమన్నాటి గంగాధర్, విశాఖపట్టణం**



# శ్రీ క్రోధి నామ సంవత్సర గ్రహచారాల ఫలితాలు

**ఈ పంచాంగం మార్కెట్‌లో దొరకదు. హాస్యప్రియత్వం సహజగుణంగా ఉన్నవాళ్ళకే ఈ యోగం!**

**గ్రహానుగ్రహం**

**ఆదాయం:** ఆర్జించినంత!

**వ్యయం:** ధరలు పెరిగిన దృష్ట్యా కాస్త ఎక్కువే!

**రాజపూజ్యం:** మీ భజన బట్టి

**అవమానం:** మీ ప్రవర్తన బట్టి

హాస్యానందం ఆస్థాన జ్యోతిష్కులు-జ్యోతిషబ్రహ్మ, భవిష్యద్రష్ట **'శ్రీశ్రీశ్రీ సత్యనిష్ఠ గ్రహాంతర సిద్ధాంతి గారు'** మొన్న చంద్రయాన్‌లో వెళ్ళి అంతరిక్షంలో స్థిర పడిపోయి, గ్రహాలతో మాటామంతి కలుపుకుని సీక్రేట్‌గా గ్రహాల గమనాలను శోధించి ఈ గ్రహచారాలను అందిస్తున్నారు.

ఈ ఫలితాలను తెలుగులో మనకందించినవారు: **కంద్లకుంట శరత్‌చంద్ర**

## మేషము

**అ**సలే ఇది క్రోధినామ సంవత్సరం. ఎవరికి కోపం తెప్పించకండి. ఇది ఎలక్షన్ల కాలం. మీరు ఎవరికి ఓటేస్తే వారు గెలిచే సూచనలు కనిపిస్తున్నాయి. అందువల్ల, జాగ్రత్తగా ఓటు వేయండి.

శుక్రుడు సైడ్ వింగులో నుండి చూస్తు న్నాడు కాబట్టి మీరు డ్రైవింగు చేసేప్పుడు కాస్త ముందువెనకా చూసుకొని జాగ్రత్తగా వెళ్లండి.

ఈ యేడు ఈ రాశివారికి శని శుభం చేకూ ర్చాలని ఎదురు చూస్తున్నాడు మీరు బెదురు చూపులు చూడకుండా ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొండి.

ఈ యేడు, మేష రాశి స్త్రీలు ఒక చిన్న వ్రతం చేస్తే చాలు...పట్టిందల్లా బంగారమే! వారంలో ఒక రోజంతా సెల్‌ఫోనును ఈశాన్య మూలలో ఉన్న బీరువాలో గానీ, అల్మైరాలో కానీ పెట్టి...ఇక దాన్ని ముట్టకూడదు! సెల్ ఫోను బదులుగా ఏవైనా మంచి పుస్తకాలు చదువుతూ ఆ రోజంతా గడిపితే చాలు! ఇక ఈ రాశి స్త్రీలకు లాభమే లాభం!

ఈ రాశివారు పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు అనే తేడా లేకుండా...ప్రతి నెలా హాస్యానందం' తెలుగు హాస్య పత్రికను విధిగా చదవాలని...పండితోత్తముల ఉవాచ!

ఈ రాశి స్త్రీలకు డబ్బులు బాగా మిగలాలంటే ఆషాఢ, శ్రావణ మాసాల్లో షాపింగులకు వెళ్ళ కూడదు.

## వృషభం

**వృ**షభం అనగా ఎద్దు. ఈ యేడు మీకు శుభాలు కద్దు! మొద్దు నిద్దుర వద్దు!

వీరికి ఆశ్వయుజమాసం వరకు అప్పులు పుడతాయి. అంచేత, అప్పులు చేయాలనుకునే వారు వెంటనే అమాయకులను పట్టుకోండి.

ఈ రాశి వారికి, ఈ యేడు సప్తమంలో రాహువు తొంగిచూడడం మూలాన, తృతీయం లో సూర్యుడు సీరియస్‌గా 46 డిగ్రీల సెల్సి యస్‌తో చూస్తుండడం వల్ల హెచ్చుతగ్గులు గోచరిస్తున్నాయి.

ఈ రాశి విద్యార్థులు, సగం తెలుగు-సగం ఇంగ్లీషు కాకుండా...సాధ్యమైనంత వరకు తెలుగులో గనక మాట్లాడితే సరస్వతీదేవి మిమ్మల్ని అనుగ్రహించగలదు.

ఈ రాశివారు బయటి ఫుడ్ తినకండి. అంతగా తినాలనిపిస్తే, బయటి ఫుడ్ ఇంటికి తెచ్చుకొని తినండి. తూర్పు వైపుకు తిరిగి ప్రతి రోజూ దండం పెడితే, పశ్చిమం వైపు నుండి తీపి కబురు అందుతుంది.

ఈ రాశి స్త్రీలు, ప్రతి శుక్రవారం చిరునవ్వు వ్రతం చేస్తే...వారి భర్తలు కరుణించి,క్రెడిట్ కార్డులను, డెబిట్ కార్డులను తమ చేతుల్లో పెట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

## మిథునం

**ఈ** రాశి వారు ఎలక్షన్లలో గెలిచే సూచనలు మెండుగా ఉన్నాయి. అయితే వీరి మంచితనం వీరి రాజకీయ జీవితానికి అడ్డమవుతుంది.

ఈ రాశి వారికి ఈ యేడు, ఊహించని విధంగా భారీ ఆస్తి దక్కడం ఖాయం. ఆ ఆస్తి, వీరి పెదనాన్న గారి అత్తగారి బావమరిదిగారి రెండో బాబాయి యొక్క తోడల్లుడి పెద్దమ్మగారి కొడుకు అత్తగారి చెల్లెలికి వేలు విడిచిన మామ గారి మొదటిభార్య రెండో కూతురు యొక్క భర్త మూడోచెల్లెలి మామగారి నుండి వస్తుంది. ఆయనెవరో, ఎక్కడుంటాడో గూగుల్‌లో వెత కండి.

ఈ సంవత్సరం వీరికి మంచి ఫలితాలు కలవు. ఇన్-స్టాగ్రాంలో వీరు, చెత్తన్నరచెత్త వీడియో పెట్టినసూ...గుప్పెడు లైకులు సంపా దించెదరు. ఇహ ఫేస్‌బుక్‌లో వీరిని ఆపడం ఎవరి తరం కాదు!

ఈ రాశి పురుషుల పర్సులు క్రెడిట్ కార్డు లతో నిండుగా ఉండును.

**గమనిక: మీరాశి ఫలితాలే కాకుండా ఇతరుల ఫలితాలు కూడా చదవటం వలన మీకు ఆనందయోగం కలుగుతుంది!**

### కర్కాటకం

**ఈ** యేడు, ఈ రాశి వారికి పని గండం ఉంది, పని చెయ్యొద్దు. ఇతరులతో భేషుగ్గా చేయించవచ్చును. టి.వి గండం ఉంది, టి.వి చూడొద్దు. రేడియో మా భేషుగ్గా వినొచ్చును.

తడి టవల్‌ను తెచ్చి మంచం మీద వేయుట, షేవింగ్ చేసుకున్న తర్వాత ఆ నీటిని వెంటనే పారబోయకుండా సింక్ పక్కన ఉంచుట, భార్యలు చెప్పేది వినకుండా, వింటున్నట్లు ఊ కొట్టుట, స్నేహితులతో రాత్రుళ్ళు మందు పార్టీలకు వెళ్ళుట లాంటి మహత్తరమైన కార్యక్రమాలు చేస్తే మాత్రం...భార్యలు చదివే తిట్లోత్తర శతనామావళి వినక తప్పదు.

ఈ రాశి స్త్రీలు...భర్తలను కొత్త పట్టుచీరలు అడగకుండా, పెళ్ళినాటి నుండి బీరువాల్లో మూలుగుతున్న పట్టుచీరలను తీసి ధరించుట, ఆర్థికంగా మీకూ, మీ వారి బ్యాంకు బేలెన్సుకు శుభకరం! ఈ రాశివారు మరింత ఆనందంగా ఉండుటకు,ఉదయం లేవగానే గంటసేపు పాత హాస్యానందం పుస్తకాలను చదవవలెను.

### సింహం

**ఈ** రాశి వారు సాధుజీవులు. తనపై వాలే దోమచేత, ఓ నాలుగు చుక్కల రక్తాన్ని అదనంగా తాగింపజేసి తృప్తిపడే త్యాగమూర్తులు!

ఈ రాశి స్త్రీలు ఈ యేడు డిజైనర్ చీరలు ఎక్కువగా కట్టుకునే అవకాశాలు గురు గ్రహం కలిగిస్తుంది. ఈ రాశి పురుషులు భార్యల దగ్గర సింహం ముందు జింక పిల్లల్లా ఫ్లూట్ ఊదుతుంటారు. ఈ రాశి విద్యార్థులు సినిమా థియేటర్లలో కంటే ఓటీటీలోనే సినిమా చూడటానికి ఇష్టపడతారు. ప్రభుత్వాలు ఉచితంగా ఇచ్చే 'వాటితో' సోమరులు కాకుండా చూసే బాధ్యత తల్లిదండ్రులదే! కష్టపడితే మంచి ఫలితం పొందుతారని బుధుడు, గురుడు మాట్లాడటం నేను విన్నాను. కష్టపడండి... సుఖ పడండి! అనే సిద్ధాంతం వీరికి శిరోధార్యం!

### కన్య

**ఏ**డో ఇంట ఉన్న శని వల్ల, ఈ రాశి వారికి ఈ యేడు మంచినీళ్ళు తాగినంత సులభంగా అప్పులు పుడతాయి! అప్పు తీసుకున్న తర్వాత ఎగ్గొట్టి తిరగడం ఎలా అనే అంశం పై నేను రాసిన 'అప్పులతో ఆనందం' అనే గొప్ప పుస్తకం చదవండి!

వీరి కుక్క వీరి ఇంటికి కాపలా కాయదు. పక్కింటికి కాపలా కాస్తుంది. మీ ఇంటికే కాపలా కాయాలంటే... శుక్ర గ్రహ శాంతి చేయించండి. ఈ రాశి నాయకులు ధర్మబద్ధంగా ఉంటే గెలుపు తథ్యం. ఈ రాశి అమ్మాయిలకు బ్యూటీ పార్లర్ వెళ్ళకుండానే అందం ఇనుమడిస్తుంది. ఎలాగంటే 'ఓం...హాస్యానందం పత్రిక చదవండాయనమః...' అనే మంత్రాన్ని లక్ష మందికి 'హాస్యానందం పత్రిక' అడ్రసుతో సహా ఈ మెయిల్ చేయండి

### తుల

**త్రా**సు ఎప్పుడూ రెండు వైపులా సమానంగా ఉండదు కదా! సరిగ్గా అలాగే,ఈ యేడు వీరికి మిశ్రమ ఫలితాలున్నాయి.

గొడవలలో తప్పెవరిది ఉన్నా సారీ మీరే చెప్పి, మీ భార్యామణుల కోపాన్ని తగ్గించి, తద్వారా మీ బిపిని కంటోల్ లో పెట్టుకోవాలని ఆరో ఇంట మీ వైపే తొంగి చూస్తున్న బుధుడు మరీమరీ చెబుతున్నాడు.

జలుబు చేస్తే, ఆశ్చర్యంగా వారం రోజుల లోనే తగ్గును.

ఈ రాశి స్త్రీలకు ఈ యేడు వాట్సప్ లో 'కొత్త చీరల గ్రూపులు', 'పాత టివి సీరియళ్ల ఫ్యాన్స్ గ్రూపులు' లాంటి ఎన్నెన్నో కొత్త గ్రూపులలో చేరే సదవకాశం ఉన్నది. హాస్యానందం పత్రిక చదవటం వలన 'లాఫింగ్ థెరఫీ' ట్రీట్‌మెంట్ మీకు అవసరముండదు.

### ధనుస్సు

**ఈ** సంవత్సరం ఈ రాశి వారు స్నేహితులు చెప్పేది వినాలో లేక బంధువులు చెప్పేది వినాలో తెలియక, ఆలోచించేలోపు... వచ్చే యేదాది వచ్చేస్తుంది. ఇంత నిదానంగా నిర్ణయాలు తీసుకోవడానికి కారణం మందగమనుడైన శని మరింత నెమ్మదిగా కదలడమే!

ఆంధ్రప్రదేశ్‌కు మూడు క్యాపిటల్సా, ఒక్క క్యాపిటలా ఏదీ కన్‌ఫర్మ్ కాకపోవడంతో వీరు కొన్న ప్లాట్ల రేట్లు కూడా అటు తగ్గక, ఇటు పెరగకా పరిస్థితి త్రిశంకుస్వర్గంలా ఉండును.

ఈ అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏదో ఒకటి ఐసాపైసా తేలి, మీరు ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారు.

ఈ రాశివారు సింహపు తోకలోని వెంట్రుకలను ఉండగా చుట్టి, రాగి తాయత్తుతో ధరిస్తే సర్వశుభదాయకం.

### వృశ్చికం

**ఏ** గడిలో ఏ గ్రహం ఉంటే మనిషి జీవితం పూర్తి సంతోషంగా ఉంటుందో, అలా ఈ రాశి వారికి కావాల్సిన గడులలో అన్ని గ్రహాలు తిష్టవేసుకొని కూర్చోవడం వల్ల వీరు ఈ యేడు పట్టిందల్లా బంగారమే.

ఈ సత్ఫలితముల వల్ల వీరికి దిష్టి తగులును. వామ్మో ! దిష్టి తగిలితే ఇంకేమైనా ఉందా! మరి, దిష్టి తప్పించుకోవడానికి , కొత్త చీరలు, కొత్త దుస్తులు కట్టి, నగలు వేసుకొని తిరుగుట మానేసి, ఉన్నంతలో కాస్త మంచి, పాత బట్టలు వేసుకు తిరగండి. అలాగే పురుషులు, ఖరీదైనా కార్లలో తిరుగుట, ఖరీదైన సెల్‌ఫోన్లు వాడుట, ఆడంబర ప్రదర్శన మానేసి సాదా జీవితం గడపండి.

### మకరం

**వీ**రికి ఈ యేడు ఒక చోట లంకెబిందెలు దొరుకుతాయి. ఆ చోటు- మీ ఇంటి నుండి ఈశాన్యం వైపు కిలోమీటర్ నడిచి, అక్కడి నుండి ఆంధ్రప్రదేశ్ రాజధాని(!) వైపుకు రెండు కిలోమీటర్లు పాకి, అక్కడి నుండి నైరుతి దిశగా జెస్ట్ 186 డిగ్రీలు తిరిగి, వెయ్యి అడుగులు వేస్తే, అక్కడొక పాడుబడిన బావిలో లంకె బిందెలున్నాయి. కేవలం మకరం రాసి వారికి మాత్రమే దొరుకుతాయని 'లంకెబిందెల శాస్త్రం'లో ఉంది. ఈ రాశి తెలంగాణా వారికి, హైదరాబాద్ గోల్కొండ ప్రాంతంలో కానీ, పాతబస్తీలో కానీ 56 వజ్రాలున్న పురాతనమైన నగ లభించే అవకాశం ఉంది. పూర్తి వివరాల కోసం హాస్యానందంలో... 'ఇందు-చందు నవ్వుల విందు' అనే సీరియల్‌ను అమూలాగ్రం నవ్వుకుంటూ పఠించి, నవ్వుకుంటూ ఆ నగ సంపాయించవలసిందిగా మనవి.

### కుంభం

ఈరాశివారి పొలంలో ఆరోగ్యాన్నిచ్చే పంట పండాలంటే ఆర్గానిక్ వ్యవసాయం చేయమని, పురుగుల మందులు, రసాయనాల వాడకం తగ్గించమని కుజగ్రహం ఘోషిస్తోంది.

ఈ రాశి స్త్రీలు, టీవీ ఛానల్స్ వారు నిర్వహించే వంటల పోటీలలో పాల్గొంటారు. అందుకుగాను 'వంట సరిగ్గా నేర్చుకోండి' అనే పుస్తకం బహుమతిగా రాగలదని గ్రహాలు శెలవిస్తున్నాయి. వీరి ఇంట్లో పచ్చళ్ళకు బూజు పట్టే ఛాన్స్ ఉంది. మీరు పెట్టే పచ్చళ్ళు బాగుండాలంటే పచ్చడి పెట్టేటప్పుడు శుచీ శుభ్రతా ముఖ్యం అని గురు గ్రహం హెచ్చరిస్తోంది. పచ్చళ్ళు నిలవ ఉంచేందుకు మంచి జాడీలు వాడాలి.(మంచి జాడీలు కావాలను కుంటే మా తమ్ముడికి హైదరాబాద్ అమీర్ పేట్‌లోనూ, విజయవాడ బీసెంట్‌రోడ్డులోనూ, వైజాగ్ జగదాంబజంక్షన్‌లోనూ జాడీల దుకాణాలు కలవు. నా పేరు చెబితే రెండు రూపాయలు తగ్గిస్తాడు. సాక్ష్యం కోసం ఈ సంచిక తీసు కెళ్ళండి)

మరిన్ని సత్ఫలితములను అందుకొనుటకు వీరు, ప్రతిరోజు ప్రశాంతంగా ఉండేందుకు ఉదయం లేవగానే 'హాస్యానందం' చదవవలెను. ఈ రాశి కార్టూనిస్టులకు అన్ని పోటీలలో బహుమతులే బహుమతులు.

ఈ రాశి రచయితలకు అద్భుతమైన ఐడియాలు వచ్చును.

### మీనం

ఈ రాశివారికి కారం గండం ఉంది! కూరల్లో కారం తగ్గించి, మాటల్లో మమకారం పెంచాలి. వాట్సాప్ గండం ఉంది, వాట్సాప్ వాడకం తగ్గించి, పుస్తకపఠనం పెంచాలి.

ఈ సంవత్సరపు గోచారం ప్రకారం, వీరు సినిమాకు వెళితే టికెట్లు దొరకవు. కాబట్టి, ఆన్-లైన్లో బుక్ చేసుకొని ముందు జాగ్రత్త తీసుకోండి.

ఈ రాశి వారికి, ఎండాకాలం లో చెమట, వర్షాకాలంలో జలుబు, చలికాలంలో చలి... వస్తాయని, అష్టమ స్థానంలో ఉన్న శనికళ చెప్పకనే చెప్తోంది.

ఈ రాశి స్త్రీలకు డబ్బు గండం మెండుగా ఉంది. భర్తలు ఎంత డబ్బు ఇస్తే, అంత డబ్బు మాత్రమే ఖర్చుపెట్టుకోవాలి. ఒకవేళ మీరు సంపాదిస్తూ ఉంటే, ఈ నియమం మీకు లేదు. గూగుల్‌పే లాంటి యూపీఐ సౌకర్యాన్ని ఎక్కువగా వాడుకోండి.

ఈ రాశి స్త్రీలు...నూటాఎనిమిది మంది పేద ముత్తైదువులకు ఒక్కొక్కరికీ ఒక ఫేస్ క్రీము, ఒక లిప్‌స్టిక్కు, ఒక షంపూ, ఒక కర్చీఫ్, రెండు ప్యాకెట్ల అప్పడాలు, ఒక ప్యాకెట్ గుమ్మడి ఒడియాలుతో హాస్యానందం పుస్తకం ఇస్తూ- 'ఇస్తి నమ్మా హాస్యానందం వాయనం' అంటూ వాయనం ఇవ్వాలి.

ఇక ఈ రాశి పురుషులు పౌర్ణమినాడు, బంధు, మిత్రులకు కనీసం వెయ్యి మందికి హాస్యానందం పుస్తకం ఇవ్వండి. మీ జీవితం 'గుండమ్మ కథ సినిమాలా సరదాగుంటుంది. లేదంటే, రాంగోపాల్‌వర్మ రక్తచరిత్రలా బీభత్సంగా ఉంటుంది.

ఆ తర్వాత మీ ఇష్టం! వినకపోతే నాకేం నష్టం!!

## క్రోధి నామ సంవత్సరంలో కొన్ని ముఖ్య సంఘటనలు!

- ఈ యేడు ఎండాకాలం, ఎన్నికల కాలం ఒకేసారి వచ్చి రాష్ట్రంలో ఎక్కువ మంట పుట్టును.
- కుల రాజకీయాలతో ఎన్నికలు కళ కళ. ప్రజలు విలవిల!
- ఎలక్షన్స్‌కు ముందు, తర్వాత కొందరు నాయకులు పార్టీలు మారతారు. (ఎవరు మారతారో తెలుసుకోవాలంటే-100,116 రూపాయల చెక్ నా పేరిట మా ఇంటికి పంపండి.)
- ఎలక్షన్స్ దెబ్బకు తెలుగు మీడియా బీభత్స రసాన్ని పారించి, టీఆర్పీ దెబ్బకు డబ్బు బాగా దండుకుంటుంది.
- ఈ యేడాది కూడా హాస్యానందం పత్రిక నిర్వహించే పోటీలలో కార్టూనిస్టులు రచయితలు బహుమతులు గెలుచుకుంటారు. (ఎవరెవరికి వస్తాయో తెలుసుకోవాలంటే..ఆయా పోటీలు అయ్యి, జడ్జిమెంట్ వచ్చేదాకా ఆగాల్సిందే!)
- ఈ ఏడాది కూడా భూమి సూర్యుని చుట్టూ, ప్రపంచం భారతదేశం చుట్టూ తిరుగును.
- ఎప్పటిలానే ప్రజలు... సినిమా, టివి రంగాలలో ఉన్నవారి యూట్యూబ్ వీడియోలు చూస్తూ కాలాన్ని చెట్టెక్కిస్తారు.
- ఎండాకాలం కూలర్లు, ఏసిలు అమ్ముడవుతాయి. వానకాలంలో గొడుగులు, ఛాయ్‌లు.. చలికాలంలో మిర్చీ బజ్జీలు అమ్ముడవుతాయి.
- ఎప్పటిలాగే ప్రజలు పుస్తకాలను తక్కువగా చదువుతూ... ఫోన్లతోనే ఎక్కువగా కాలక్షేపం చేస్తారు. కళ్ళ డాక్టర్లకి మంచి డిమాండ్ ఏర్పడుతుంది.
- కొంతమంది ఆచీ తూచీ మాట్లాడక పోవటం వలన లేనిపోనీ గొడవల్లో ఇరుక్కుంటారు.
- ఏ డైలీ పేపరు ఏ పార్టీకి కొమ్ము కాస్తుందో తెలియక పాఠకులు డైలీ పేపర్లు చదవటం తగ్గిపోతుంది.
- ప్రపంచంలో కొన్ని చోట్ల ప్రకృతి వైపరిత్యాలు.
- ఎప్పటిలానే తెలుగు ప్రజలు..తెలుగును చిన్నచూపు చూడడంలో మొదటి స్థానంలో ఉంటారు.



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**

**యర్రంశెట్టి శాయి**



# కొంగుచాటు కృష్ణుడు

**గత సంచికలో...** రంభ, ఊర్వశి, తిలోత్తమలు ముగ్గురూ కలిసి ప్రారంభించిన 'మన్మధా మెన్స్ బ్యూటీ పార్లర్' మూడవ బ్రాంచి ప్రారంభంతో పాటు 'మేడ్ ఫర్ ఈచదర్' పోటీని ప్రకటించారు. ఆ పోటీలో పాల్గొనడానికి దేవలోకంలో అందరూ సిద్ధమవుతున్నారు... ఈలోగా మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది.

**ఆ తర్వాత...**

**"పార్వతిని శక్తి కోసం, లక్ష్మిని డబ్బు కోసం, సరస్వతిని విద్య కోసం ప్రజలు ఆరాధిస్తారు. కానీ ప్రతీ అర్భకుడూ ఈ మధ్య 'తనలో ఏదో శక్తి ఉన్నదని' అనుకోవటం మొదలు పెట్టిన తర్వాత... పార్వతి పట్ల ప్రజల్లో ఆరాధన కాస్త తగ్గింది కదా!" మెప్పుకోలు కోసం తన నాలుగో తలతో భార్య వైపు వాలుగా చూస్తూ అన్నాడు.**

**"ఒకప్పుడు సరస్వతి ఉన్నచోట లక్ష్మి ఉండదని నానుడి ఉండేది... కానీ ఇప్పుడు బాగా చదువుకున్నవారు కూడా ధనార్జనాపరులు అవుతున్నారు. అది గ్రహించి... వేల కోట్ల సంఖ్యలో విద్యార్థులు సరస్వతిని పూజిస్తున్నారు!"**

**"నిక్కము చెప్పితివి చతుర్ముఖా!" అన్నాడు నారదుడు.**

**"...అప్పటి నుంచీ నీ భార్య పై పార్వతికి అసూయ ఎక్కువైంది".**

భార్యా భర్తలు మొహాలు చూసుకున్నారు... తాను చెపుతున్నది వినేవారికి అర్థం అవటం కోసమా అన్నట్టూ ఆగి–

"లక్ష్మి, సరస్వతులకున్న పేరు ప్రఖ్యాతులు తనకి లేవన్నది శాంకరి అలకకి తొలి కారణం. లక్ష్మి సరస్వతుల కన్నా తనకి తక్కువ ఆలయాలు ఉన్నవన్నది మలి వాస్తవం! ఇప్పుడు అగ్నికి గాలి తోడైనట్టు సరస్వతి 'సృష్టి' కూడా ప్రారంభించిందని తెలిసింది! దాంతో ఆమె వరమిచ్చిన ఆ భూలోక జీవులని నానా కష్టాలు పెట్టి, చదువుల తల్లి అతిశయాన్ని తగ్గించమని ఇంద్రసతికి చెప్పింది." అన్నాడు తగవుల తెంపు దేవర.

"సరస్వతీ గర్వభంగమా?"

"ఒక మాటలో చెప్పాలంటే అంతే పంచముఖా!... నీ తలని తన భర్త కత్తిరించిన విషయం కూడా ప్రస్తావించింది!" అన్నాడు.

సరస్వతి చివాలున లేచి– "నా భర్తనే అవమానిస్తుందా? నా పైనే సవాలు విసురుతుందా?... ఎంత ధైర్యం!... చూస్తాను! నా అంకురాలని నేను అనుక్షణం కాపాడతాను. నా వాళ్ళని ఆ ఇంద్రసతి ఎలా కష్టపెడుతుందో చూస్తాను. ఇదే నా శపథం!" అంటూ లేచి అక్కడి నుంచి విసవిసా లోపలికి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన వైపే దిగులుగా చూస్తూ–"అయ్యో నారదా! ఇప్పుడీ పార్వతీ–సరస్వతి సంవాదాలతో... శపథాలతో మనం ఆ చిన్న పిల్లల్ని..." అని ఏదో అనబోతూ ఉండగా నారదుడు అడ్డు పడ్డాడు.

"వద్దు చతుర్ముఖా! ఈ ఆడవాళ్ళ పోటీల్లో మనం పాల్గొనుట ప్రమాదకరం. ప్రేక్షకుడిలా చూడటమే ఉత్తమం!"

"అంతేనంటావా?"

"అంతే! అంతే!! నారాయణ.... నారాయణ..." అంటూ అక్కడి నుంచి కదలబోతూ ఉంటే బ్రహ్మ–

"నారదా! ఆగు!!" అన్నాడు.

త్రిలోక సంచారి ఆగాడు.

"ఎప్పుడో దశాబ్దాల క్రితం విడుదల అయిన చిత్రం గురించీ, భూలోకంలో పెరుగుతున్న సరస్వతి ప్రతిష్ఠ గురించీ పార్వతిని 'ఎగతోసింది' నీవే కదూ?"

"నారాయణ... నారాయణ. గతంలో రామాంజనేయుల, కృష్ణార్జునుల మధ్య యుద్ధాలకీ నేనే కారణమన్నారు కొందరు. అలా అబద్ధాలు ప్రచారం చేసినవారు ప్రస్తుతం యముని శాపంతో... అంతర్జాలంలో తప్పుడు వార్తలు ప్రచారం చేసేవారుగా పుట్టి ఉబ్బిన కడుపులతో బాధలు అనుభవిస్తున్నారు."

"అంతేనంటావా!?"

"ఏది జరిగినా లోకకల్యాణం కోసమే అన్న విషయం

నీకు తెలీదా పద్మనాభ పుత్రా!" అసలు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి కదిలాడు నారదుడు.

కలహభోజనుడు కదిలిన వైపే చూస్తూ బ్రహ్మ జాలిగా...

'...ఈ ఇద్దరు అతివల మధ్య పోటీ పాపం ఆ అయిదుగురు పిల్లల బ్రతుకుల్ని ఎన్ని మలుపులు తిప్పుతుందో...' అనుకుంటూ లిప్త కాలం కళ్ళు మూసుకున్నాడు.

భూమ్మీద కాలం పాదరసంలా పరుగెత్తటానికి బ్రహ్మ రెప్పపాటు కాలం చాలు కదా! ఆ క్షణకాలంలో పిల్లలు యువకులయ్యారు.

కథ అలా మొదలైంది....

**కథా ప్రారంభం**

భర్తతో సవాలు చేసి సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు.

మల్లెమాల అంటే మల్లెదండ కాదు. ఇది తెలియాలంటే ఇంటి పేర్ల వెనుక కథ తెలుసుకోవాలి.

జలాశయాల పక్కనున్న ఊళ్ల పేర్ల చివరన 'చెరువు, కుంట, గుంట, కొలను, కుళం, మడుగు, కంభం' మొదలైనవి ఉంటాయి.

కొండని ఆనుకుని ఉన్న పల్లెను 'మాల' అంటారు. అలాంటి చోట వచ్చిన గ్రామాల పేర్లే అర్తమాల, కొండమాల, మల్లెమాల మొదలైనవి. ఆ రోజుల్లో పది-ఇరవై పల్లెల మధ్యన ఒక పెద్ద పల్లెలో ప్రభుత్వ ఖజానా ఉండేది. దాన్ని 'ప్రోలు' అంటారు. గొల్లప్రోలు, భట్టిప్రోలు పేర్లు ఆ విధంగా వచ్చినవే..!

ఆకూ, అలము అన్న నానుడిలో 'ఆల' అనేది గడ్డిజాతికి చెందిన మొక్క. చీరాల, పేరాల, కడియాల మొదలైన పేర్లు కూడా అలా వచ్చినవి.

సరస్వతి రెండో సృష్టి పేరు గూటాలపల్లె ఆనందరావు.

'పల్లె' బౌద్ధుల నివాసం. బనగానపల్లె, రేపల్లె, చర్లపల్లి దీనికి ఉదాహరణలు.

అప్పటి కాలంలో జైనులు ఉండే చోటుని 'పాడు' అనేవారు. ఉలవపాడు, దోసపాడు, దొండపాడు, దూపాడు పేర్లు అలా వచ్చాయి.


మొదట్లో మనుష్యులకి ఒక పేరే ఉండేది. వలసలూ, వృత్తులూ ప్రారంభమైన తరువాత, వారు నివసించే ఊళ్ళ బట్టి, చేపట్టిన వృత్తి బట్టి ఇంటి పేర్లు ఏర్పడ్డాయి.


జ్యోతిష్య, వాణిజ్య, ఉపాధ్యాయ వృత్తుల్లో ప్రసిద్ధులు అయినవారి సంతతికి జోస్యుల, శెట్టి, భట్ల, వఝుల, బోయిన అనేవి ఇంటిపేర్లు అయ్యాయి.

భక్తులు ఇచ్చిన పశువులను సాకి, దేవాలయానికి నేయి అందించే వృత్తి గల వారిని గుండుబోయలు అంటారు. సరస్వతి మూడో సృష్టి పేరు గుండుబోయిన సాత్వికరావు.

జ్ఞానపీఠ పరివేష్టిత విశ్వనాథవారిని ఇక ఇక్కడ వదిలి మనం కథలోకి ప్రవేశిద్దాం.

✦✦✦






అది యొక రమణీయ విద్యాలయము. ఆ ఆలయమందు అది యొక మేడ. ఆ మేడ పై అది యొక మారుమూల గది.

ఆ గది తల్పులు మూసి దీక్షగా పాతికేళ్ళ యువకుడు–పోలిక జగదీష్‌చంద్రబోసు... చేయుచున్నాడు పరిశోధనలు తనలో తాను లీనమై!

ఆ రోజు ఇంటికి త్వరగా రమ్మని చెప్పింది అతడి భార్య. ఆమె తెలుగు లెక్చరర్. ప్రతి రోజూ ఆమె టి.వి. సీరియల్స్ లో అత్తగారిలా అలా చెబుతూనే ఉంటుంది. అయితే 'ఇంటికి ఎందుకు త్వరగా వెళ్ళాలి?' అనే విషయం అతడికి ఇన్ని సంవత్సరాలు ఆలోచించినా అర్థం కాలేదు.


అతడు ఇంటికి వెళ్ళేసరికి ఆమె టీవీ చూస్తూ ఉంటుంది. తల తిప్పకుండా–

"వంటింట్లో అన్ని పెట్టే ఉంచాను!..." అంటుంది. హాలుకీ వంటిల్లుకీ మధ్య తలుపు లేదు. అతడు అన్నీ కంచంలో పెట్టుకొని, ఆమె గదికి కాస్త దూరంలో కూర్చుని... భోజనం చేస్తాడు.

ఆమె టి.వి నుంచి కన్ను కూడా తిప్పకుండా చూడటంలోనే నిమగ్నమై ఉంటుంది. 'ఇంత దాని కోసం ఇంటికి ఎందుకు తొందరగా రమ్మందో' అర్థం కాదు.

బహుశా ఆమె కూడా ఇంత దానికి ఇంటికి తొందరగా రావటం ఎందుకో అని... అతడి గురించి అనుకుంటూ ఉండొచ్చు.

స్కూలు వదిలి అప్పటికే రెండు గంటలు అవుతోంది. ఒక్కొక్క గదికీ తాళాలు వేసుకుంటూ వరండాలో వస్తున్నాడు బషీర్. ఆ పని పూర్తయిపోతే నైట్ వాచ్‌మెన్‌కి తాళాలు అప్పజెప్పి ఇంటికి పోవచ్చు. ఆ పై దుబాయి ట్రిబుల్–జీరోకి ఫోన్ చెయ్యాలి.




అలా ఆలోచిస్తూ బషీర్ కెమిస్ట్రీ ల్యాబ్ దగ్గరకు వచ్చాడు. అక్కడికి వచ్చేసరికి 'కాంతారా' సినిమాలోలా, బషీర్‌కి ఏదో పూని చిర్రెత్తుకు వస్తుంది. కానీ 'టీ' కి కక్కుర్తి పడి ఆ చిరాకుని లోలోపలే అణుచుకుంటాడు.

అసలు విషయం ఏమిటంటే, మల్లెమాల చంద్రబోసు ఆ స్కూల్లో సైన్స్ టీచరు. పగలు స్కూల్లోనూ, స్కూలు వదిలాక రహస్య ల్యాబ్ లోనూ పరిశోధనలు చేస్తూ ఉంటాడు. క్షమించాలి... రహస్య ల్యాబ్ అనగానే అపార్థం చేసుకోవద్దు. స్కూలు వదిలి... అందరూ వెళ్లిపోయాక... అదే స్కూలు తాలూకు కెమిస్ట్రీ ల్యాబులో రహస్యంగా ప్రయోగాలు చేస్తూ ఉంటాడు.

గత ఎనిమిదేళ్ళుగా అతడు ఆ విధంగా చేస్తూనే ఉన్నాడు!

బషీర్ చూస్తూనే ఉన్నాడు!

అప్పుడప్పుడు రాత్రిళ్ళు మరీ ఆలస్యమైతే, ఆ గదిని వదిలేసి, మిగతా రూమ్స్‌కి తాళాలు వేసుకుని వెళ్ళి పోతాడు.

మర్నాడు ఉదయం వచ్చేసరికి పగిలి పోయిన టెస్ట్‌ట్యూబ్‌లూ... పొగలు వచ్చే ద్రావకాలూ కనబడుతూ ఉంటాయి. బోస్‌ని తిట్టుకుంటూ అవన్నీ శుభ్రం చేయటం, మరుసటి రోజు బర్నాల్ పట్టీలతో చంద్రబోసు క్లాసుకి రావటం... ఇవన్నీ మామూలే.

"మేమందరం వెళ్ళిపోయాక మీరు ఇక్కడ ఏమి చేస్తూ ఉంటారు సార్?" అని అప్పడప్పుడు కుతూహలంతో అడుగుతూ ఉంటాడు బషీర్.

"ప్రయోగాలోయ్.... ఎక్స్‌పెరిమెంట్లు!"

"పదేళ్ల నుంచీ స్కూల్లో ల్యాబ్‌లో పని చేస్తున్నాను సార్. ప్రయోగాలను ఇంగ్లీషులో 'ఎక్స్‌పెరిమెంట్స్' అంటారని తెలుసు. నేను అడుగుతున్నది ఈ ప్రయోగాలు ఎందుకూ అని?"

"లోకకల్యాణం కోసం బషీర్... ప్రజల శుభం కోసం!"

"రోజూ రాత్రి పదింటి వరకూ కల్యాణం, శోభనం ఏమిటి సార్?"

"పిచ్చివాడా! కల్యాణం వేరు... లోక కల్యాణం వేరు. అలాగే శుభం వేరు. శోభనం వేరు!"

"నాకు తెలుగు సరీగ్గా రాదు... కల్యాణం అంటే ఏమిటి సారూ?"

"పెళ్లి!"

"శోభనం అంటే?"

"పెళ్లి వలన కలిగే... మూడురోజుల ఆనందం!"

"మరి 'శుభం' అంటే?"


"ఆపై ముప్పై సంవత్సరాల ట్రాజెడీ సినిమా చివర్లో పడే కార్డు!"

"ఏమి కళ్యాణమో? ఏమి శోభనమో? పొరపాటున హెడ్‌మిస్ట్రెస్‌గానీ, ఛైర్మెన్‌గారు గానీ చెక్ చేయటానికి ఏ రాత్రో వచ్చారంటే నాకు కల్యాణం చేసి ఉద్యోగం ఊడ బీకుతారు!"

## నవ్వు కొమ్మచ్చి



సరసి




"భయపడకు బషీర్!... నా పరిశోధనకి ప్రధానమంత్రి నుంచి ఏ క్షణంలోనైనా పిలుపు రావొచ్చు. అప్పుడు నువ్వు ఊహించనంత పెద్ద బహుమతి ఇస్తా!"

ఇలా జరుగుతుంది వారి మధ్య సంభాషణ.

ప్రధాన మంత్రులు మారారు కానీ పిలుపు రాలేదు. అయితే ఈ అభినవ ఐన్‌స్టీన్ గురించి బషీర్ ఎప్పుడూ హెడ్‌మిస్ట్రెస్ వసంతకు చెప్పలేదు. అలా చెప్పకుండా ఉండటానికి బోసు ప్రతిరోజూ అతనికి టీ తాగిస్తూంటాడు. ఒక్కోరోజు రెండుసార్లు టీ తాగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దాంతో బషీర్ అతడికి పూర్తిగా లొంగి పోయాడు. చంద్రబోసు రహస్యంగా చేస్తున్న ఈ పరీక్షల గురించి బషీర్ స్కూలు యజమాన్యానికి చెప్పక పోవటానికి అసలు కారణం అతడు ఉచితంగా తాగే 'టీ' కాదు! దాని వెనుక దేశ పునాదులని కదిల్చే ఒక భయంకరమైన రహస్యం ఉంది!

చదువరీ... దాని గురించి తర్వాత తెలుసుకుందాం.

"సారూ! ఎనిమిదయింది. ఇక పోదామా?" అన్నాడు బషీర్.

"ఇంకో అయిదు నిముషాలు!" అనాలి బోసు... కానీ ఆ రోజు అనలేదు... నిజానికి అతనికి బషీర్ మాటలు వినిపించనే లేదు. పొగలు గ్రక్కుతోన్న గాజుగొట్టాల కేసి పరీక్షగా చూస్తున్నాడు. అంతలో నాళికలోని ద్రావకం హఠాత్తుగా తెలుపు నుంచి ఎరుపు రంగులోకి మారింది! ఉండుండి అందులోంచి మంటలు పైకి లేస్తున్నాయి! చంద్రబోసు ముఖం ఎగ్జయిట్‌మెంట్‌తో నిండిపోయింది!


"సార్!" అని బషీర్ వినయంగా పిలిచాడు.


చంద్రబోస్‌కి ఆ మాటలు వినిపించలేదు. మరుగుతోన్న ద్రావకం వైపే తదేకంగా చూస్తున్నాడు. అందులోంచి మంటలు రావటం ఆగిపోగానే మరింకేదో ద్రావకం కలిపాడు. మరుక్షణం తెల్లని పొగ ప్రారంభమైంది!

**(సశేషం)**





# ఎలక్షన్ సీజన్






ఆందోళన, ఒత్తిడి, బి.పి. పెరగటం, వికారం
ఇవన్నీ జాబితాలన్నీ విడుదలయ్యే వరకూ
వుంటాయమ్మా... మందులేం పనిచేయవు...
మరో జాబితా విడుదలపై కసరత్తు...
డాక్టర్ నిస్సహాయ్
జాబితా..మళ్లీ రివర్స్


మన వాడే సార్! మన పార్టీలోంచి వెళ్లింతర్వాత ఈ వారం రోజుల్లో పదిహేడు పార్టీలు మారి- మళ్లీ ఇక్కడికొచ్చి పడ్డాడు- పాపం...!!
పార్టీ అధ్యక్షుడు


అన్ని ఏర్పాట్లు చేశాం కానీ, బడ్జెట్ సరిపోక ఫోటోగ్రాఫర్ని.. టీవీ, వీడియో కవరేజ్ క్యాన్సిల్ చేయాల్సి వచ్చింది సార్!
AGENDA
మంత్రి గారి రాజకీయ పునః ప్రవేశ సమావేశం.


ఈ ఈజిప్ట్ మమ్మీని ఇక్కడ పెట్టారు ఎందుకమ్మా
మమ్మీ కాదురా ఎన్నికలు వస్తే రూల్ ప్రకారం అలా విగ్రహాలకు ముసుగు వేస్తారు
vath


తత్కాల్లో టిక్కెట్లు సంపాదించలేని మీరు... పార్టీ టిక్కెట్టు ఏం సంపాదిస్తారు.. నా బొంద!
Omkar.


ఏం వెటకారంగా వుందా? ఇదంతా నా వల్ల కాదు, ఎన్నికల టైం కదా, ఓట్లు అడగటానికి ఎమ్మెల్యే, ఎం.పి. అభ్యర్థులు వస్తారు కదా! చెరో సగం కొట్టేస్తారులే!



# పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు

గౌరవ న్యాయనిర్ణేత: **శ్రీ తనికెళ్ళ భరణి**

తొలిసారి నన్ను చూసిన, అమ్మ నవ్వు మోము...
ఏడుస్తూ పుట్టిన నాకు, లోకంలో నవ్వుతూ బతకాలని నేర్పింది.
జనులు నన్ను మెచ్చుకున్నపుడు, నా తండ్రి పెదవులపై క్షణకాలం మెరిసే గాంభీర్యపు చిరునవ్వు, లోకంలో తలెత్తుకుని తిరిగేలా చేసింది.
వారిద్దరికీ నవ్వులిష్టం.
నాదీ అదే పోలిక.
వారి గుర్తుగా అందరికీ నవ్వులను పంచాలన్న ప్రయత్నమే...
**పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక**
**ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీ.**
మన హాస్యానందం రాము గారి కొండంత సహకారానికి...
పోటీలో పాల్గొన్న రచయితల ఉత్సాహానికి ఉడుతాభక్తిగా
నమస్సులు తెలియజేసుకుంటున్నాను.



పాఠకుల ఆదరణ కోరుకుంటూ....
శ్రీకాంతశర్మ పాలపర్తి

శ్రీ క్రోధి నామసంవత్సర యుగాది సందర్భంగా నిర్వహించిన **పాలపర్తి రాజగోపాల్, ఉమాదేవి స్మారక ఉగాది కొసమెరుపు మినీ హాస్య కథల పోటీకి** అనూహ్యమైన స్పందన లభించింది. ఈ పోటీకి సుమారు 210 కథలు వచ్చాయి. ఇంచుమించు అన్ని కథలు బావున్నాయి. అయితే ఈ కథల పోటీ అనుకున్నప్పుడే 'చిన్న కథలకు' బహుమతి ఇవ్వాలని, ఎందుకంటే చిన్న కథలు రాయటం చాలా కష్టం. రచయిత(త్రు)లకు ఇది ఒక ఛాలెంజ్ అవుతుందని భావించి, 'కథలు ఎంత చిన్నవైతే అంత ప్రాముఖ్యం. కొత్తగా నవ్వులు కురిపిస్తే చాలు బహుమతి మీకే!' ఇదొక్కటే నిబంధనగా ఇవ్వటం జరిగింది!
ఈ నిబంధనకు లోబడే బహుమతులు ప్రకటించాం.
ఈ పోటీలో పాల్గొన్న రచయితలకు, రచయిత్రులకు కృతజ్ఞతలు. బహుమతి పొందిన వారికి అభినందనలు.
ఈ పోటీని వారి తల్లిదండ్రులపేరిట నిర్వహించిన **శ్రీ శ్రీకాంతశర్మగారికి ధన్యవాదాలు.**
**బహుమతి పొందిన కథలు 16వ పేజీ నుండి 35 పేజీల వరకు ఇవ్వటం జరిగింది.**
ఈ కథలన్ని చదివి ఆస్వాదిస్తారని ఆశిస్తూ...

**-ఎడిటర్**

**విశిష్ట బహుమతి పొందిన కథ**

# ఎప్పుడు పడితే అప్పుడు

"నేను మొదటిసారి బోర్లా పడితే మా అమ్మ బొబ్బట్లొండిందట!" అన్నాడు సుబ్బు భార్యతో.

ఆమె వినలేదనుకుని రెండోసారి చెప్పేడు.

"అంతే కదా! మీరీసారి బోర్లాపడితే నేనూ వండుతాలెండి!" అంది సత్య.


ఆమె అలా ప్రకటించిన రెండోరోజే సుబ్బు వంటింటి గుమ్మం దగ్గర బోర్లా పడ్డాడు! ముక్కుకి ఎర్రటి టమాటా అతికించినట్లయింది!

"బాధపడకండి బొబ్బట్లొండుతా!" అని అన్నంత పనీ చేసింది సత్య. ముక్క విరిచి పేరుకున్న నెయ్యిలో ముంచి తింటూ ముక్కు బాధ మరిచిపోయాడు సుబ్బు.

పదిరోజుల తర్వాత ఓనాడు– "యావండీ! బొబ్బట్లొండనా?" అంది సత్య గోముగా.

ఎగిరి పడబోయి తమాయించుకుని– "ఎప్పుడు పడితే అప్పుడు వొండుతూ పోతే నూనె, శనగపప్పూ, బెల్లానికీ ఎంత ఖర్చవుతుందో తెల్సా?" అరిచేడు సుబ్బు.

"సరేలెండి! ఎప్పుడు పడితే అప్పుడు వండను. మీరెప్పుడు పడితే అప్పుడే వండుతా!" అంది సత్య.



వినాయక చవితినాడు స్నానానికెళుతూ ముందుకి తూలి బోర్లాపడ్డాడు సుబ్బు. ఉండ్రాళ్ళతో బాటు బొబ్బట్లొండింది సత్య.

దసరాల్లో మహర్నవమి నాడు వరండాలో బోర్లాపడ్డాడు. కాసేపటికల్లా వేడివేడి బొబ్బట్లు సిద్ధం! దీపావళికి జాగ్రత్తగా వుండాలనుకున్నాడు... కాని అనూహ్యంగా ఓ రోజు ముందే నరక చతుర్దశినాడు నడుస్తూ నడుస్తూ బోర్లా పడిపోయాడు!

"పోనీలెండి. మామూలు రోజుల్లో వండుతానంటే మీరెట్టాగూ వొప్పుకోరు. పండగల్లో పడుతున్నారు సంతోషం. ఏదో పిండివంట ఎలాగూ చెయ్యాలిగా!" అనేది సత్య.

పెద్ద పండగలే కాదు. మాసశివరాత్రి, జగ్జీవన్‌రామ్ జయంతి, మిలాదునబి, కూర్మజయంతి లాంటి పండుగలకి కూడా పడిపోతున్నాడు సుబ్బు.

ఆ పడటం బాగా అలవాటై దెబ్బ తగలకుండా వొడుపుగా పడుతున్నాడు ప్రాక్టీసుమీద.

సంక్రాంతికి సుబ్బు తల్లి వచ్చింది. తల్లి చెవిలో బాధ వూదేడు సుబ్బు. ఆమె చిన్నప్పుడు డిటెక్టివ్ కథలు బాగా చదివిన మీదట రహస్యం పసిగట్టేసింది! ప్రతిసారీ సుబ్బు తనంతట తాను పడిపోవడంలేదు. కోడలు కాలడ్డం పెట్టి పడగొట్టేస్తోంది! రెడ్‌హేండెడ్‌గా కోడల్ని పట్టేసిందామె!

"నిజమే! నాకు బొబ్బట్లిష్టం! మామూలుగా అడిగితే కాదంటున్నారని నేనే పండగల్లో ఈ పాపప్పునికి పూనుకున్నాను. నా పాపానికి నిష్కృతి లేదు!" అంటూ భోరున ఏడ్చి ముక్కు తుడుచుకుంది సత్య!

"బాధపడకు సత్యా!" అంటూ ముందుకు రాబోయి బోర్లా పడ్డాడు సుబ్బు!

"మాయదారి సంత!" అంటూ వంటింటివైపు వెళ్లింది సుబ్బు తల్లి బొబ్బట్లు వండటానికి!

సత్య కొంగు చాటున నవ్వు తుడుచుకుంది!!





సరసి,
9440542950

విశిష్ట బహుమతి పొందిన కథ

# సుకుమారి స్పృహ కోల్పోయింది


ప్రతీ ఆదివారం లాగానే ఆ ఆదివారం నాడు కూడా సుందరం యింట్లో చతుర్ముఖ పారాయణం జరుగుతోంది జోరుగా, హుషారుగా. సుందరంతో పాటు అతని సహోద్యోగులు, చుట్టుపక్కల యిళ్ళ వాళ్ళు కలిపి మరో అయిదుగురు పేకాట వీరులు ఆటలో పాల్గొని తరిస్తున్నారు.

వేలాది రూపాయలు చేతులు మారుతున్నాయి.

ఈ పేకాట పూజా కార్యక్రమం జరుగుతున్నంత సేపూ ఆ యింటి ఇల్లాలూ మరియూ సుందరం భార్య అయినటువంటి సుకుమారి–వాళ్ళకి అవసరమైన కాఫీ, టీ లు మరియూ స్నాక్సు అనబడే పకోడీలూ, బజ్జీలూ వగైరా వండి వడ్డిస్తూ... నడ్డి విరగ్గొట్టుకునే పరమ పతివ్రతా శిరోమణి.

మధ్యాహ్నం భోజనాల వేళ దాటిపోయినా ఎవరూ వాళ్ళ యిళ్లకు తిళ్ళకు వెళ్లే సూచనలు కనిపించక పోవడంతో సుకుమారికి చిర్రెత్తుకొస్తోంది.

అప్పటికే ఉదయం తొమ్మిది నుండీ గంట గంటకూ టీ, కాఫీలూ, వడలూ, కరప్పూసా వగైరాలు ప్లేట్లలో పెట్టి అందిస్తూ రోబోలా వంటగదిలోంచి హాల్లోకి, హాల్లోంచి వంటగదిలోకి గిరగిరా తిరుగుతూ సతమతమవుతోందామె.



టైము రెండయ్యింది.

ఒక్కరూ కదలడం లేదు. వాళ్ళు వెళ్ళిపోతే యింత ముద్ద తిని కాసేపు నడుం వాలుద్దామన్న ఆమె ఆశ నెరవేరేలా కనిపించడం లేదు.

ఇంక ఓపిక నశించిన సుకుమారి – పేకాట హాల్లోకి వచ్చి... “ఇంక ఆ దిక్కుమాలిన ఆట చాలించి మీ మీ యిళ్లకు తగలడే ఆలోచన ఏమైనా ఉందా మీ అందరికీ?” అంటూ బిగ్గరగా కేకలు వేయడం మొదలు పెట్టింది.

ఆమె అరుపులకు గాబరా పడిన సుందరం... “సుక్కూ ఊరుకోవే.... పరాయి వాళ్ళ యింట్లో ఉంటూ యిలా వాళ్ళ మీదే కేకలు వేస్తే బావుండదే.... కాస్త తగ్గవే!” అని పెళ్ళాన్ని బుజ్జగించడం మొదలు పెట్టేడు.

సుకుమారి అనుమానంగా ఆ హాల్లోని టీవీ, సోఫా, కుర్చీలూ, ఫ్యాన్లూ అన్నిటినీ పరికించి చూసి అవన్నీ తమవే అని నిర్ధారించుకుని...

“అలా అంటారేమిటీ? యిది మన యిల్లేగా?” అని అడిగింది సుందరాన్ని.

“నాలుగు ఆటల క్రితం వరకూ యిది మన యిల్లేనే. ఇప్పుడు ఈ యిల్లు అదిగో ఆ శంకర్రావు మేష్టారిది. అవిగో దస్తావేజులు. కావలిస్తే చూసుకో!”

చావు కబురు చల్లగా చెప్పేడు ఆ జూదలమారి సుందరం.

ఆ మాటతో స్పృహ తప్పి పడిపోయింది సుకుమారి....

విశాలమైన శంకర్రావు మేష్టారి యింటి హాల్లో!





**కోనే నాగ వెంకట ఆంజనేయులు,**
**9290660220**

విశిష్ట బహుమతి పొందిన కథ

# సాక్ష్యం కావాలా?

గోదావరి పుష్కరాలకి పురుషోత్తమరావు దంపతులు కొవ్వూరెళ్ళారు. హోటల్‌రూమ్ కోసం అడిగితే, మీరు దంపతులు అని ప్రూఫ్ చూపించమన్నాడు హోటల్ మేనేజర్.

ప్రూఫ్ కోసం ఏం చూపించాలో తెలియక బిక్కమొహం వేసాడు పురుషోత్తం.

"మీ పెళ్లి శుభలేఖ కాని, ఫోటోలు, వీడియోలు ఏముంటే అవి చూపించండి చాలు."


"ముప్ఫయ్ అయిదేళ్ళ క్రితం పెళ్లి అయింది. అవన్నీ పట్టుకుని తిరుగుతామా?"

"పోనీ మీకు పెళ్ళి చేసిన పురోహితుడ్ని సాక్షిగా తీసుకురండి."

"మాకు పెళ్లి చేసిన పాపానికి ఆయన ఎప్పుడో గోదాట్లో కలిసిపోయాడు." మొగుడికేసి కోపంగా చూస్తూ అంది సూరేకాంతమ్మ.

"రోజులు బావులేవమ్మా! లవర్స్, మొగుడూ పెళ్ళాలమంటూ రూమ్ తీసుకుంటున్నారని పోలీసు లొచ్చి మామూళ్ళు పట్టుకుపోతున్నారు... విసిగించకండి. ఈ ఊళ్ళో మీ బంధువులుంటే తీసుకురండి."

"మాకీఊళ్ళో దిక్కూ మొక్కూ ఉంటే, మీ దిక్కుమాలిన హోటల్‌కి ఎందుకు వస్తాం?!... సాక్ష్యం కావాలా?.. చూడు ఇదిగో!" అంటూ మెళ్ళో మంగళసూత్రాలు చూపించింది చంద్రమతి కాని సూరేకాంతం.





"ఫుట్‌పాత్ మీద పదిరూపాయలకి ఇలాంటి బోడిసూత్రాలు బోల్డు దొరుకుతాయి. మీరు చెప్పినవి నమ్మడానికి నేనేం వెర్రిపప్పును కాను. ఎళ్ళవమ్మా! ఎళ్ళు!!" చిరాగ్గా అన్నాడు హోటల్ మేనేజర్.

'బోడి' అనగానే... తాచు పాములా బుసకొట్టింది సూరేకాంతమ్మ.

"ఏటండీ మీ నోరు... పడి పోయిందా? మీరు బతికుండ గానే, మీరు కట్టిన తాళిని చూపిస్తే... పునిస్త్రీని పట్టుకుని బోడంటాడు. మీకు పౌరుషం లేదా? మీ పిసినారితనానికి అంతం లేదా? చవగ్గా రూమ్ దొరుకుతుందని ఈ 'బోడి' హోటల్‌కి తీసుకొచ్చారు. మొన్నా అంతే పండక్కి మా అమ్మకీ, నాన్నకి బట్టలు పెట్టమంటే వాళ్ళు ఊరెళ్లిపోయేదాక మీరు కొంపకి రాలేదు. మా తమ్ముడు పెళ్లికి అంతే... వాడికి ఖాళీ గిఫ్ట్ కవరిచ్చారు. మీతో రావడంతో అడ్డమైన వాళ్ళతో మాట పడవలసి వస్తోంది. ఛీ! నాదే బుద్ధి తక్కువ." మొగుడ్ని పట్టుకుని సూరేకాంతం ఉతికారేసింది.

"అమ్మా! మీరే ఏకైక భార్య అనీ...ఆయనే పాపం భర్త అని అర్థమయ్యేసరికి నా బుర్ర వేడెక్కిపోయింది... ఇవిగో ఏ.సి. రూమ్ తాళంచెవులు, తీసుకో తల్లీ!" అంటూ హోటల్ మేనేజర్ దణ్ణం పెట్టాడు.



పోలప్రగడ జనార్దనరావు(జెన్ని)
9849142361

విశిష్ట బహుమతి పొందిన కథ

# రెండో ఇల్లు

**సుం**దరం ఇల్లు కట్టించుకుంటున్నాడు.... అయితే ఏంటి ? అనకండి.


నన్నోసారి వచ్చి ఆ ఇల్లు చూసి వెళ్ళమని ఎప్పటినుంచో అడుగుతున్నాడు. ఎందుకని అడక్కండి! మనల్ని గానీ, మన పనుల్ని గానీ ఎవరు మెచ్చుకున్నా బాగుంటుంది గానీ మనం ఇష్టపడే వాళ్ళు కొందరు మెచ్చుకుంటే మరింత బాగుంటుంది.

అదిగో అందుకే అతగాడు నన్ను అలా అడుగుతున్నాడు.

నిజంగానే వేరే పనుల వత్తిడి వల్ల ఇప్పటిదాకా వెళ్ళలేకపోయాను. ఇక వెళ్ళకపోతే మర్యాద కాదనిపించింది. అందుకే ఈరోజు మధ్యాహ్నం ముహూర్తం పెట్టుకున్నాను. ఆ మాటే సుందరంతో చెప్పాను... ఎగర్లేదుకానీ గంతేశాడు... ఉబ్బితబ్బిబ్బయ్యాడు...

తనే వచ్చి నన్ను కార్లో తీసుకువెళతానన్నాడు. ఆదివారం, ఆఫీసుకు సెలవు! అన్నట్లు చెప్పటం మర్చిపోయాను. సుందరం నాకు మంచి స్నేహితుడే కాదు సహోద్యోగి కూడా.

సుందరం సున్నిత మనస్కుడేమీ కాదు కానీ... తనకి వ్యతిరేకంగా ఏం చెప్పినా బుస్సున కోపం వస్తుంది. తుస్సున చల్లర్తుంది కూడా. నా దగ్గరయితే ఇంకొంచం తొందరగానే చప్పగా చల్లారిపోతుంది అతగాడి కోపం. అతని సంగతి పూర్తిగా తెలిసినా...నేను మాత్రం చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పేస్తుంటాను. నిజం చెప్పొద్దూ అందుకే నన్ను అంతగా ఇష్టపడతాడు సుందరం. నాకూ అతనంటే బాగా ఇష్టమే. అదిగో ఆ ఇష్టాల కారణంగానే ఓ సారి నన్నొచ్చి ఆ ఇల్లు ఎలా వుందో చెప్పమని అతగాడి కోరిక. భోజనం చేసి మా పెంకుటింటి వరండాలో మా నాన్న పడుకునే వాలుకుర్చీలో నడుం వాల్చి పడుకున్నాను. సిగరెట్ పొగ రింగులురింగులుగా వదులుతూ అలౌకికానందానికి లోనవుతున్న తరుణంలో కారు హారన్ మోగింది. కళ్ళు తెరిచాను. ఉన్నపళంగా లేచాను. కారెక్కి సుందరంతో బయలుదేరాను.



దారి పొడుగునా కలప కోసం ఎంత కష్టపడింది, సింహ ద్వారం డిజైన్ కోసం ఎన్ని వాకబులు చేసింది, ఫ్లోరింగు కోసం ఎన్ని వూళ్ళు తిరిగి సెలక్ట్ చేసుకున్నదీ... చెబుతూ కొత్త ఇంటి ముందు కారు ఆపాడు. అతని ముఖంలో వెలుగు, సంతోషం కొట్టొచ్చినట్లు కనిపించినాయి.

ఇల్లంతా చూపించాడు. అతని అభిరుచి చాలా బాగుంటుంది. అందుకు తగినట్లే శ్రద్ధ తీసుకుని మరీ ఇల్లు కట్టిస్తున్నాడు. చాలా బాగుంది. తలుపులు, దర్వాజాలు, కిటికీలు, ఒకటేమిటి అన్నీ దేనికవే ప్రత్యేకంగా ఉన్నాయి.ఇంటికి వేయించిన రంగులు కూడా చాలా చాలా బాగున్నాయి. ఆ మాటలే అతనితో చెప్పి. చివరిగా... ఇది నాకు నచ్చిన రెండో ఇల్లు అన్నాను.

అంతే! అతని ముఖం ఎర్రగా మారిపోయింది. రోషం కొట్టొచ్చినట్లు కనిపించింది.

"మొదటిది ఏది?" అని అడిగాడు ఆవేశంగా.

"మా ఇల్లు!" అన్నాను ప్రశాంతంగా గట్టిగా కౌగిలించుకుని!

"నిజం చెప్పావ్!" అన్నాడు....

ఇద్దరం నవ్వుకున్నాం!





**పెనుమాక నాగేశ్వరరావు,**
**9441254044**

**విశిష్ట బహుమతి పొందిన కథ**


# గోతిలో కాదు, నూతిలో

**అ**ప్పుడే హుషారుగా తన ఫ్లాట్ నుండి బయటికి వచ్చిన మధు, పక్క ఫ్లాటు వైపు చూసి... షాక్ కొట్టినట్టు కర్ర ముక్కలా బిగుసుకుపోయి...

గబుక్కున లోనికెళ్ళిపోయి, తలుపు మూసేసి నుదుటిన పట్టిన చెమట తుడుచుకుని...

'నా... నా పక్క ఫ్లాటులోకి కొత్తగా అద్దెకి దిగింది, నా మాజీ శ్రీమతి సురేఖా?!' అని వణుకుతున్న చేతులతో జేబులోంచి ఫోన్ తీసి... తన స్నేహితుడు శేఖర్‌కి ఫోన్ చేసాడు.

అంతా విన్న శేఖర్... "అవునా! అయినా నీ మాజీ భార్య మరీ చిత్రమైన మనిషి. లేకపోతే, ఆమె స్నేహితురాలు అరసుకుమారి, అదే ఆ పురుషద్వేషి రచయిత్రి మాటలు విని... బంగారం లాంటి నిన్ను వదులుకుంది... అయినా ఆ అరసుకుమారి అప్పుడు నీ మాజీ భార్యకి ఏం చెప్పిందో తెలీదు కానీ, ఎవరి మాటా వినకుండా నీకు విడాకులివ్వడానికే నిర్ణయం తీసుకుంది. అప్పుడు ఆ రచయిత్రి,



నీ మాజీ భార్యకి ఏం కల్పించి చెప్పిందో కానీ అవి నిజవనుకుని... నీ మాజీ భార్య, నీ ప్రస్తుత భార్యకి ఎప్పుడైనా ఏవైనా చెప్పినా... చేసినా కొంపలంటు కుంటాయ్... కనుక వెంటనే ఫ్లాట్ ఖాళీ చేసేయ్! " చెప్పాడు.

"సరే..." అని, తన భార్య లలితని ఒప్పించి, ఆ రోజే ఫ్లాట్ ఖాళీ చేసేసాడు.

ఆ సాయంత్రమే ఓ కొత్త ఫ్లాట్‌లో పాలు కూడా పొంగించేసారు...

సోఫాలో వెనక్కి జారబడిన మధు–

'హమ్మాయ్య!...పెద్ద గోతిలో పడబోతూ తప్పించు కున్నట్టుందిరా దేవుడా!...' ప్రశాంతంగా చిరునవ్వు నవ్వుతూ అనుకున్నాడు.

ఇంతలో... మధు భార్య లలిత, జీడిపప్పు ఉప్మా తెచ్చి ఇచ్చింది.

అందుకుంటూ..."ఎక్కడిది?" అడిగాడు.

"పంచదార కోసం ఎదురు ఫ్లాట్‌కి వెళితే... ఒకావిడ ఇచ్చింది." అని వెళ్ళబోతూ ఆగి...

"ఆమె కథలు వ్రాస్తుందట. పేరు అరసుకుమారి" అని చెప్పడంతోనే... వణుకుతున్న చేతులతో కర్చీఫ్ తీసుకుని, చెమట తుడుచుకుని...

'అంటే... గోతిలో పడకుండా తప్పించుకోబోయి, నూతిలో పడ్డానా ఖర్మ!" అనుకున్నాడు బిక్కమొహంతో.





**గంగాధర్ వడ్లమన్నాటి,**
**9908445969**

విశిష్ట బహుమతి పొందిన కథ

# ముందు చూపు

"ఏమే! చూడూ ఈ సంబంధం అంతా బాగుంది కానీ... పేరు విచిత్రంగా 'శార్దూలము' అని రాశారు. ఫ్యాషన్ పేర్ల మోజులో అర్థం పర్థం లేని పేర్లు!" అంటూ విసుక్కుంటున్న భర్త మాటలకు...

"పేరుకేం... బ్రహ్మాండంగా వుంది. ఎడ్డి మేళాలు, మీకు తెలుగు భాష సంగతి తెలియదని మరొకసారి ప్రూఫ్ చేసుకున్నారు కానీ... 'శార్దూలము' అనేది ఒక వృత్త పద్యము!" అంటున్న భార్య మాటలకు ఎగతాళిగా నవ్వుతూ...

"ఓహో! మరిచాను. పేరు ప్రత్యేకంగా వుండాలనే అమ్మాయి సరదా కూడా తీరుతుందిలే. మనవలు పుడితే...ఇంటిదూలము, ముక్కుదూలము అనే పేర్లు పెడితే ప్రాసకూడా సరిగ్గా సరిపోతుంది... సరే అయితే, మంచి సంబంధము. అంతా బాగుంది. బోలెడు ఆస్తిపరులు... అమ్మాయి సుఖపడుతుంది!" అంటున్న భర్తను మధ్యలోనే ఆపుతూ...


"అన్నీ బాగానే వున్నాయి కానీ...నిశ్చితార్థానికి ముందు ఒకరాత్రి నేను పెళ్ళికొడుకు ఇంట్లో నిద్ర చెయ్యటానికి వాళ్ళు సమ్మతిస్తే, ఈ సంబంధానికి ఓకె చేస్తాను!" అంటున్న భార్యను వింతగా చూస్తూ...

"ఇదేం కొత్త ఫిట్టింగ్!... అలా అడగటానికి ఏం బాగుంటుంది? అయినా ఎందుకు అలా అంటున్నావో చెప్పవే కామేశ్వరీ?" అన్నాడు భార్యను బుజ్జగించే ధోరణిలో.

"మా నాన్నకి, నాలా ముందుచూపు లేకపోవడం వలన... నా పెళ్ళైన తరువాత నేను చాలా బాధలు పడ్డాను!" అంటూ కన్నీళ్ళు రాకపోయినా కళ్ళు తుడుచుకుంటున్న భార్యను చూస్తూ కోపంగా...

"నువ్వు ఏం బాధలు పడ్డావు?" అంటూ స్వరం పెంచి భార్యపై కన్నెర్ర చేశాడు రామలింగం.

"మంచం ఎక్కింది మొదలు... మీ నోట్లోనించి వచ్చే విమానాల శబ్దం... వెళ్ళే విమానాల శబ్దం వింటూ... ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపానో ఆ భగవంతుడికే తెలుసు!... నా కూతురుకి అలాంటి పరిస్థితి రాకూడదని... గురకలు లేని వాడితో పెళ్ళి చెయ్యాలని నా ప్రయత్నం!" అంటున్న భార్య మాటలకు తల దించుకుని బుద్ధిగా తల ఊపాడు రామలింగం.







**తెలికిచెర్ల విజయలక్ష్మి,**
**9301421243**

విశిష్ట బహుమతి పొందిన కథ

# డిసీజ్ పై ఛీటింగ్!

అది హోలీ పండుగ రోజు.

సత్యానంద్ ఏడేళ్ళ కొడుకు సోంబాబు పిల్లలతో కల్సి ఆడుకుంటున్నాడు.

వాళ్ళల్లో ఎవరో సోంబాబు కళ్ళల్లో రంగులు చల్లారు.

దాంతో తనకి కళ్ళు కనిపించడం లేదని అక్కడే ఏడుస్తూ కూర్చున్నాడు.

అది తెల్సి, సత్యానంద్ ఆయన భార్యామణి పరుగున వచ్చి కొడుకుని కంటి హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు.

డాక్టర్ టెస్ట్ చేసి– "ఏం ఫర్వాలేదు! మూడు రోజులు ఇక్కడే వుంచండి... కళ్ళు కనబడేట్టు చేసే పూచి నాది!" అన్నాడు.


"డాక్టర్స్ ముందు అలాగే అంటారు... తర్వాత ఏదో కారణం చెప్పి చేతులు ఎత్తేస్తారు!..." అని భార్యతో గొణిగినట్టుగా అన్నాడు సత్యానంద్.

సోంబాబు కళ్ళల్లో డాక్టర్ ఏదో మందు పోసి– 'మూడు రోజుల తర్వాత కట్లు తీస్తాను. అప్పుడు కళ్ళు కనిపిస్తాయి" అని సత్యానంద్‌తో చెప్పాడు.

మూడు రోజులు గడిచాయి.

కళ్ళకు కట్టు తీస్తుండగా... "డాక్టర్ గారు! కళ్ళు తప్పకుండా కనిపిస్తాయా?" అని అనుమానంగా అడిగింది సత్యానంద్ భార్య.

ఇరిటేట్ ఫీల్ అయిన డాక్టర్... "ఏమండీ!... ఒకవేళ మీ అబ్బాయికి కళ్ళు కనిపించ లేదనుకోండి... మీరు ఇవాల్సిన యాభై వేలులో ఒక్క పైసా కూడా నాకు ఇవ్వకండి!" అని అన్నాడు.



దాంతో సత్యానంద్ భార్యకు కాన్ఫిడెన్స్ తన్ను కొచ్చింది.

కట్లు తీసి సోంబాబుని కళ్ళు తెరవమన్నాడు డాక్టర్.

తెరిచాడు!... కానీ "కళ్ళు కనిపించడం లేదు!" అన్నాడు సోంబాబు.

దాంతో సత్యానంద్ భార్య ఏడుపు స్టార్ట్ చేయడానికి రెడీ అవుతుండగా ..

"సారీ! ఏదైనా పెద్ద హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళండి... నాకు మీరేమీ రూపాయి కూడా ఇవాల్సిన అవసరం లేదు!" అని డాక్టర్ అక్కడి నుండి వెళ్ళి పోయాడు.

సత్యానంద్, ఆయన భార్య షాక్ అవుతుండగా...

"డాడీ!... నాకు కళ్ళు బాగా కనిపిస్తున్నాయి. డాక్టర్‌తో అబద్ధం చెప్పి, మీకు రూపాయి కూడా ఖర్చు లేకుండా చేశాను... సో! ఇక నన్ను తిట్టకండి.." అని బ్యాగు తీసుకుని...

"రండి! ఇంటికెళ్దాం" అని అక్కడినుండి బయటకు నడిచాడు సోంబాబు.

"మీ పీనాసి బుద్ధిని మనవాడు ఏడేళ్ళకే బాగా అర్థ చేసుకున్నాడు" అని వ్యంగ్యంగా అంది సత్యానంద్‌తో ఆయన భార్య.



గాంధీ మనోహర్,
9849051846

విశిష్ట బహుమతి పొందిన కథ

# బస్సు జర్నీ

'పల్లె ఊసులు' బస్సు మహిళలతో కిటకిటలాడుతుంది. బట్టతలాయన వెంట్రుకల్లా అక్కడక్కడ మగవాళ్ళు బిక్కుబిక్కుమంటూ కనిపిస్తున్నారు... మంచి హుషారుగా ఉన్నాడు కొత్తగా ఉద్యోగంలో చేరిన కండక్టర్ పిరికేంద్రరావు... కారణం మహిళలందరికీ ఎక్కడికైనా సున్నరూపాయల టిక్కెట్. ఎడారిలో బ్రహ్మజెముడు మొక్కల్లా ఉన్న మగోళ్ళకే టిక్కెట్ కొట్టడం కనుక! అందరికీ టిక్కెట్ కొట్టి రైట్... రైట్ అని రెండు నిమిషాలు కాలేదు... బస్సు రెండడుగులు వేయలేదు...

బొంగురు గొంతుతో ఓ మహిళ– "ఆపండి!" అని గట్టిగా అరిచింది.

చూట్టానికి తాటకిలా ఉంది. ఒక్కసారి ఉలిక్కిపడ్డ కండక్టర్ గుండెలమీద తపతప...


"తూ!...తూ!..." అని ఉమ్మేసుకుని ఏమయిందని పీలగొంతుతో అన్నాడు.

"కనిపించడంలేదూ? ఇప్పుడే దాటొచ్చిన టీలు చాపు (స్టీల్ షాప్ అన్నమాట) లో టీలు గుండిగ (స్టీల్ బిందెన్నమాట) ఎంతముద్దొచ్చేత్తుందో... అది కొనుక్కొని ఇంకో బస్సెక్కి ఒచ్చేత్తా!" అంది.

ఖర్మ! ఖర్మ!... అనుకుంటూ– "హోల్డాన్" అని అరిచాడు.

బస్సు ఆగింది. ఆమె దిగిపోయింది... మరల బస్సు బయలుదేరింది.

"ఇప్పుడు టేజ్ (స్టేజ్ అన్నమాట) దాటొచ్చిన కాడ... 'సింగినాదం సిల్కు' సీరల సాపులో సిఫాన్ సీరలు ఎలా ఉన్నాయనుకున్నావు?... నిన్నే ఎళ్ళాను ఆ సాపుకి, మరల అయిపోతాయేమోనని ఓ అరడజను సీరలు కొనుక్కొని తెచ్చేసుకున్నానే నాంచారమ్మా!" అంది పక్కనే కూర్చున్న వెంకాయమ్మతో.



ఈ మాటలు ఆళ్ళిద్దరి పక్కనే కూచున్న సుబ్బాయమ్మ చెవిలో పడ్డాయి.

అంతే! క్షణం ఆలస్యం చేయలేదు...

"ఓల్డాన్! ఓల్డాన్!!" అరిచింది సుబ్బాయమ్మ.

మరొక్కసారి తుపుక్ తుపుక్ మని గుండెలమీద ఉమ్మేసుకుని ఏంటి చెప్పు అన్నాడు కండక్టర్.

"ఏంటీ చెప్పేదీ... చెపుతున్నాను కదా ఓల్డాన్, ఓల్డాన్ అని... ఓలమ్మో ఓలమ్మో బారెడు దూరం వచ్చేసింది ఆ సిల్కు సాపునుండి. ఆపు! ఆపు!!" అని గట్టిగా అరిచింది.

గబగబా దిగిపోయింది సుబ్బాయమ్మ.

ఒక ఫర్లాంగు వెళ్ళిందో లేదో బస్సు సడెన్‌గా ఆగిపోయింది. ఏంటబ్బా... ఏమయింది అని... ఎందుకయినా మంచిదని కండక్టర్ నోట్లో ఉమ్మురెడీ చేసుకుంటుంటే, డ్రైవర్ సీట్లోంచి దిగుతూ కనిపించింది మహిళా డ్రైవర్ దుర్గమ్మ (అవును దుర్గమ్మే).

"ఏమయింది?" అని అడిగాడు కండక్టర్.

"కనిపించడం లేదూ? మహిళా ఎగ్జిబిషన్ ఈ రోజే చివరి రోజంట!... రండర్రా ఎవరైనా ఇంకెవరైనా వస్తారేమో... ఒక పదినిమిషాల్లో వచ్చేద్దాం!" అంది.

బిలబిలా లోపలున్న మహిళలందరూ దిగిపోయారు.

కండక్టరూ, మిగిలిన ఒకరిద్దరు మగమహారాజులు మాత్రమే మిగిలారు.

బిక్కచచ్చిపోయాడు కండక్టర్.





**కొమ్ముల వెంకట సూర్యనారాయణ,**
**9949602721**

విశిష్ట బహుమతి పొందిన కథ

# భలే దంపతులు

**"మా** బాబాయికి ఇష్టమని టమాటా పప్పు చెయ్యమన్నాను... అయినా దోసకాయ పప్పు చేసావేం? నా మాటంటే నీకసలు లక్ష్యం లేదు." అన్నాడు కోపంగా కోపేశ్వర్రావు. అసలుపేరు కామేశ్వర్రావైనా ఎప్పుడూ నిప్పుమీద పడ్డ ఉప్పులా చిటపటలాడుతూ ఉంటాడని అందరూ కోపేశ్వర్రావని పిలుస్తారు.

"మీ బాబాయినే అడగండి! దోసకాయ పప్పు చేస్తే తింటారా?... అని అడిగితే సరేనన్నారు. నా తప్పేముంది ఇందులో?" చుర్రుమంది చాముండేశ్వరి.


"నీ నోటికి జడిసి అనే ఉంటాడు!"

"అలా అని మీ నోటికి నే జడవాలా?" కౌంటరిచ్చింది చాముండేశ్వరి.

ఇంక తను రంగప్రవేశం చెయ్యకపోతే, అక్కడంతా రణరంగమౌతుందని బుద్ధేశ్వర్రావు వాళ్ళిద్దరి మధ్యకు వచ్చాడు... "సరేలే! ఇవాళ్టికి దోసకాయపప్పుతో సరిపెట్టుకుందాం... రేపు టమాటాపప్పు చేసుకోవచ్చు." సర్దిచెప్పాడు.

"అలా గడ్డిపెట్టండి అతనికి!" అందా ఇల్లాలు.

"అంటే నేను గడ్డితినే పశువునా?" రంకె వేసాడు కోపేశ్వర్రావు.



మళ్ళీ తల పట్టుకున్నాడు బుద్ధేశ్వర్రావు... 'నేరకపోయి మీ కొత్త సంసారం చూడటానికి వచ్చి ఇరుక్కుపోయాను, బుద్ధిగా ఇంట్లో పడి ఉండక.' అనుకొని మళ్ళీ సర్ది చెప్పే ప్రయత్నం చెయ్యసాగాడు.

బుద్ధేశ్వర్రావుకి వచ్చిన దగ్గరనుండి వాళ్ళని సమాధాన పర్చడంతోనే సరిపోతుంది. పాముా ముంగిసలా, ఎలుకా పిల్లిలా, టాం అండ్ జెర్రిలా అనుక్షణం పోట్లాడుకునే ఈ దంపతుల్ని ఎలా మార్చాలా అని ఆలోచించగా ఓ బ్రహ్మాండమైన ఐడియా తట్టింది బుద్ధేశ్వర్రావుకి.

వెంటనే వాళ్ళిద్దర్నీ పిలిచి– "చూడండి! ఎప్పుడూ ఇంట్లోనే అలా ఉండి మీరిలా పోట్లాడుకుంటున్నారు. కొన్నాళ్ళు ఏ కోడైకెనాలో, ఊటీకో వెళ్ళి గడిపి రండి, బాగుంటుంది." అని సలహా ఇచ్చాడు.

ఏకాంతంగా అలాంటి ప్రదేశాల్లో గడిపితే దంపతులిద్దరి మధ్య ఫెవికాల్లా గట్టిబంధం ఏర్పడుతుందని... గట్టి నమ్మకం అతనిది. ఏ కళనున్నారో ఇద్దరూ ఒప్పుకొన్నారు. వాళ్ళిద్దర్నీ ఊటీకి పంపించేసి ఊపిరి పీల్చుకున్నాడు బుద్ధేశ్వర్రావు.

సరిగ్గా రెండు రోజుల తర్వాత ఉదయమే కాలింగ్ బెల్ మోగితే తలుపు తీసాడు...వారం రోజుల తర్వాత చేతిలో చెయ్యి వేసుకొని, చెట్టాపట్టాలేసుకొని తిరిగి వస్తారనుకున్న ఇద్దరూ చిర్రుబుర్రులాడుతూ కనిపించారు. వాళ్ళని చూసి నిర్ఘాంతపోయాడు.

"ఇంట్లోలా అక్కడ తిట్టుకుంటూ గొడవ పడుతుంటే ఎవ్వరూ ఒప్పుకోవడంలేదు బాబాయ్! న్యూసెన్స్ కేసు కింద పోలీసులకు కూడా అప్పచెప్పారు!" అంటూ ఇంట్లోకొచ్చాడు కోపేశ్వర్రావు.

"ఏమిటీ?! అక్కడ కూడా కాట్లాడుకున్నారా?" ఆశ్చర్యపోయాడు బుద్ధేశ్వర్రావు.

ఈ సారి ఆశ్చర్యపోవడం ఆ దంపతుల వంతైంది.

"ఏమిటీ అక్కడికి తిరగడానికి మమ్మల్ని పంపించారా? మేమింకా ఇంట్లో కన్నా అక్కడ గొడవ పడమని పంపించారనుకున్నాం." అందా మహా ఇల్లాలు.

ఆ మాటలు విని మూర్ఛపోయాడు పాపం బుద్ధేశ్వర్రావు.



పద్మావతి దివాకర్ల,
9040499919

విశిష్ట బహుమతి పొందిన కథ

# న్యూ ట్రెండ్

గాలిమార్పుగా ఉంటుందని బీచ్‌కి వచ్చాను. ఆదివారం సాయంత్రం కావడంతో కాస్త రద్దీగానే ఉన్నది. చల్లని సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ ఇసుకలో నడుస్తూ పోతున్నాను. పెద్దవాళ్ళ అరుపులు, పిల్లల కేరింతలు, రకరకాల వస్తువులను అమ్మేవారి కేకలతో, సముద్రపు అలల ఘోషతో ఉన్న ఆ పరిసరాల ఆహ్లాదాన్ని అనుభవిస్తున్న నాకు దూరంగా కొందరు గుంపుగా నిలబడి ఉండడం కనిపించింది. ఏమయ్యుంటుందో చూద్దామని వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాను.

గుంపును చీల్చుకుని చూశాను. అక్కడ కనిపించిన దృశ్యం నా గుండెను కలిచివేసింది.

కాస్త వయసు పైబడిన ఆడ, మగ, ఒకరి చేతిని ఒకరు పట్టుకుని పడుకుని ఉన్నారు. వారి మెడలో పూలమాలలు కూడ ఉన్నాయి. వారు ప్రాణాలతో ఉన్నట్లుగా నాకు అనిపించలేదు. కొందరు కుర్రాళ్ళు ఆ దృశ్యాన్ని సెల్ ఫోనులో వీడియో తీస్తున్నారు. నాకు వళ్ళు మండింది. మరణించిన వారు ఎవరో, ఏమిటో తెలుసుకోకుండా... పోలీసులకు ఫోను చేయకుండా వీడియోలు తీయడమేమిటి... విషయం ఏమిటని నా పక్కన ఉన్న వ్యక్తిని అడగబోయాను.



"పాపం! ఈ వయసులో ఎంత కష్టం వచ్చిందో వీళ్ళకు... అప్పుల బాధలు తట్టుకోలేక పోయారేమో?"

"పిల్లలు ఇక్కడ ఉన్నారో... లేక విదేశాలలో ఉన్నారో?!"

"ఒకరి మీద ఒకరికి విపరీతమైన ప్రేమేమో, కలిసే ప్రాణత్యాగానికి పూనుకున్నారు!"

"బహుశా పెళ్ళిరోజేమో? దండలు కూడ వేసుకుని ఉన్నారు!"

"ఎంతకష్టమొచ్చి ఇలా చేశారో?!"

"ఇక్కడ శవాలను పెట్టుకుని... వాడు చూడు ఫారిన్ కెమెరాతో వీడియో తీస్తున్నాడు. ఈ కాలం పిల్లలు బాధ్యత లేకుండా ఫోన్‌లో ఎలా వీడియో తీస్తున్నారో చూడండి!... నాశనమయి పోయింది సమాజం!" ఒక పెద్దాయన రుసరుసలు.

ఇలా తలా ఒకరకంగా మాట్లాడుకోవడం నా చెవిన పడింది.

నాకు తెలిసిన కానిస్టేబులుకు ఫోను చేయబోయాను.

ఇంతలో... "అంకుల్! ఇక లేవండి... షూటింగ్ అయిపోయింది. కంగ్రాట్స్! చాలా బాగ వచ్చింది మీ ప్రి షష్టిపూర్తి వీడియో... ఇకలేచి స్టిల్స్ ఇవ్వండి!" అన్నాడు ఇందాక వీడియో తీస్తున్న వ్యక్తి.

వెంటనే పడుకుని వున్న భార్యాభర్తలు లేచి- "అందరూ మమ్మల్ని మన్నించాలి. ఈరోజులలోలా ప్రివెడ్డింగ్ షూట్ చేసుకోలేక... మా ముచ్చటకోసం షష్టిపూర్తి ముందు వెరైటిగా ఉండాలని 'ప్రి షష్టిపూర్తి' షూట్‌ను ఇలా ప్లాన్ చేశాము. ఇదో కొత్త ట్రెండ్. ఇంతమంది వచ్చి మా షూట్‌లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు" అని చెప్పి చెంగుచెంగున ఎగురుతూ స్టిల్ ఫొటోలు తీయించుకోవడానికి కదిలారు.

అక్కడ చేరిన అందరూ "వీళ్ళ ట్రెండు పాడు కాను. పిదపకాలం, పిదపబుద్ధులు!" అంటూ మొటికలు విరిచారు.

మాటలురాక నిలబడి పోయిన నన్ను చూసి ఒక కుర్రాడు-"ఏంటి అంకుల్! అవాక్కయారా? ఇది అంతంకాదు ఆరంభం. భవిష్యత్తులో ఇలాంటి ట్రెండ్లు చాలా వస్తాయి. వెయిట్ అండ్ సీ!" అని భుజంతట్టి వెళ్ళిపోయాడు.





శింగరాజు శ్రీనివాసరావు,
9052048706

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# సహన జీవి

బ్రహ్మచారి సతీష్ ఒక ఇంట్లో అద్దెకు దిగాడు.

ఇంటి ఓనర్ గారి అమ్మాయి రాధ చాలా అందంగా కనిపించింది.


రాధ అందానికి ముగ్ధుడైన సతీష్ అప్పటికప్పుడే బ్రహ్మాండంగా ఒక లవ్ లెటర్ రాసేశాడు. వన్ ఫైన్ మార్నింగ్ ఆ లవ్ లెటర్ ని బెదిరిపోతూనే రాధ చేతికి అందించాడు.

“నీ మొఖానికి లవ్ లెటరా !” అని దాన్ని అతని మొఖం మీదే చింపి పారేసింది రాధ.

ఆ రాత్రంతా బోలెడు బాధపడిపోయి చివరికి తనను తానే ఓదార్చుకున్నాడు సతీష్.

రెండు రోజుల తర్వాత కాలేజీ నుంచి ఇంటికి వస్తున్న రాధతో “లిఫ్ట్ ఇస్తాను” అన్నాడు.

“రాస్కెల్! గెట్ అవుట్!”అంటూ అరిచింది రాధ.



దాంతో బిత్తరపోయి అక్కడ నుంచి పారిపోయాడు సతీష్. కొన్ని రోజులదాకా బాధపడిపోయాడు.

ఒకవారం తర్వాత రాధ మార్కెట్ నుంచి కూరగాయల సంచితో వస్తుంటే ఎదురెళ్లి– “మీ చేతులు కందిపోతాయి నేను పట్టుకు వస్తాను సంచి ఇవ్వండి!...” అన్నాడు ప్రేమగా.

“ఇడియట్ వెళ్లవతలకు!” కసిరింది రాధ.

కుమిలిపోతూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు సతీష్.

రెండు నెలలు గడిచిపోయాయి.

రాధ తండ్రి ఒక గొప్పింటి సంబంధాన్ని తీసుకొని వచ్చాడు.

“చూడమ్మా!... నీకోసం ఒక గొప్ప ఇంటి కుర్రాడిని సెలెక్ట్ చేశాను!” చెప్పాడు.

“సారీ నాన్న! నేను సతీష్‌నే పెళ్లి చేసుకుంటాను...” చాలా నిదానంగా చెప్పింది రాధ.

“నీ చేత అన్ని అవమానాలు పడ్డ ఆ కుర్రాడినా!” బోలెడు ఆశ్చర్యపోయాడు రాధ తండ్రి.

“అవును నాన్న! ఇన్ని అవమానాలు పడ్డ అతనిలో భయంకరమైన సహనాన్ని చూశాను... నా భర్తగా కావాల్సిన అర్హతలు అన్నీ అతనిలో కనిపించాయి. మా ఇద్దరికీ పెళ్లి జరిపించండి!...” తన నిర్ణయాన్ని తెలియజేసింది రాధ.

అంత గొప్ప సహనజీవి తనకు అల్లుడుగా రానున్నందుకు బోలెడు సంతోషించాడు రాధ తండ్రి. ఆ వెంటనే ఒక మంచి ముహూర్తంలో వారికి పెళ్లి కూడా చేసేశాడు. ఈ రోజుల్లో అమ్మాయిలు కోరుకుంటుంది బోలెడు సహనం ఉన్న అబ్బాయిలనని ఆయన గ్రహించాడు.



పీవీ రమణ కుమార్,
9494495062

**ప్రత్యేక బహుమతి పొందిన కథ**

# టిక్కెట్ ఫ్రీ


**బు**ల్లెబ్బాయికి నలభయ్ ఏళ్లు దగ్గర పడ్డాయి. ఇంకా పెళ్లి కాలేదు.

"ముదిరిపోయిన బెండకాయ... వీడికి ఇంకా పిల్లనిచ్చేది ఎవరు? ఒకవేళ ఇచ్చినా దానికి ఎన్ని లోపాలు ఉంటాయో?!" అంటూ స్నేహితులు బంధువులు విసిరే మాటలకి చెవులు ఎప్పుడో అలవాటు పడ్డాయి.

అయినా ఏ అచ్చటాముచ్చట లేకుండానే తెల్లార్చుకోవడం బోల్డంత ఇబ్బందిగానే ఉంటుంది బుల్లెబ్బాయికి. మొన్న మొన్నటి వరకు సరైన ఉద్యోగం లేదు వ్యాపారం లేదు... దాంతో అటు సొసైటీలోనూ ఇటు సంబంధాలు వెతికి పట్టుకోవడంలోను వీక్ అయ్యాడు. తల్లిదండ్రులు కూడా తన పెళ్లి విషయంలో చేతులెత్తేయటంతో ఇక తన తిప్పలు ఏవో తనే పడాలని గట్టి కంకణం కట్టుకున్నాడు.

ఈ క్రమంలోనే పార్కులు, రెస్టారెంట్లు, షాపింగ్‌మాల్స్, సినిమాహాల్స్... అలా కనిపించిన ప్రతి చోట కనిపించిన అమ్మాయిని చూడటం మొదలుపెట్టాడు. ఒకరిద్దరిని ఫాలో అయి ఛీలు, ఛీదరింపులు కూడా జీర్ణించుకున్నాడు.

ఇలా ఉండగా ఓ రోజు బస్‌స్టాప్‌లో నిలబడ్డ అతనికి ఎదురు బస్‌స్టాప్‌లో తనకు సరిగ్గా సూట్ అవుతుంది అనిపించే అనుష్కలాంటి ఓ అందమైన యువతి మెరిసింది కళ్ళ ముందు. మెడలో నల్లపూసలు, కాళ్ల మెట్టెలు కనిపించకపోవడంతో గుండె గుబగుబలాడింది.




"నువ్వీదరిని.. నేనా దరిని.. బస్టాప్ కలిపింది ఇద్దరినీ..." అని పాట పాడుకుంటూ ఎలాగో కష్టపడి ఆమె అడ్రస్ సంపాదించాడు.

క్యాలెండర్లో శుభఘడియలు వెతికి నేరుగా ఆమె ఇంటికి వెళ్లి డోర్ తట్టాడు... ఐ లవ్ యు చెబుదామని. ఓ మగ మనిషి డోర్ తెరుచుకొని బయటికి వచ్చాడు కాసేపటికి.

బహుశా తను చూసిన అమ్మాయి అతని చెల్లో తల్లో అయి ఉంటుందని... "చల్లకొచ్చి ముంత దాచటం మా బ్లడ్‌లోనే లేదు... నేను ఈ ఇంట్లో ఉండే అమ్మాయిని గాఢంగా ప్రేమించాను. పెళ్ళంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని డిసైడ్ అయ్యాను దయచేసి నా ప్రాబ్లం ఫిక్స్ చేయండి." అన్నాడు.

"చేస్తారా! చేస్తా!! నీ ప్రాబ్లం నా ప్రాబ్లం కలిపి ఫిక్స్ చేస్తా! ఏదో ఆడవాళ్ళకి బస్సు టికెట్ ఫ్రీ అన్నారు కదా అని కక్కుర్తిపడి ఆడవేషంలో తిరుగుతుంటే లవ్వు, కొవ్వు అంటూ వెంట పడతావా.." అంటూ మూలన ఉన్న చీపురు కట్ట అందు కున్నాడు ఆ మగతను. ఇప్పటిదాకా ఎన్నో సంబంధాలు క్యాన్సిల్ ఐన అనుభవం ఉన్నా, ఈ సంబంధం ఈ రేంజ్‌లో షాక్ ఇచ్చినందుకు బెంబేలెత్తిపోతూ చీపురు చురుకు అంటకుండానే పరారయ్యాడు బుల్లెబ్బాయ్.



**పావులూరి శివాజీ,**
**9849893398**

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# బారు-రౌండ్లు


“ఏమండీ! సాయంకాలం షాపింగ్‌కి వెళ్దామండీ! ఉగాదికి పట్టుచీర కొనుక్కోవాలి! లోహియా శారీ షాపులో ఒక పట్టుచీర కొంటే మరో పట్టుచీర ఉచితమట!” అంటున్న శ్రీలక్ష్మి వైపు వింతగా చూసాడు శ్రీకాంత్.

“మొన్న సంక్రాంతికి ఇలాంటి ఆఫరు ఉంటే కొనేసావు కదే రెండు పట్టుచీరలు! అందులో ఒకటి ఈ పండక్కి పనికిరాదా ఏమిటి?” అన్నాడు.

“ఓ౦...అదా! అది ఎదురింటి పరమేశ్వరి ఇంట్లో పేరంటం ఉంటే కట్టేసుకున్నానండీ!... పోనీ, ఆ పట్టుచీరే ఉగాదికి కట్టుకుంటా! పట్టు చీర బదులు నెక్లెస్ కొనండి!” అంది మరింత మురిపెంగా.

“ఎందుకులే... మొదటిదానికే ఫిక్స్ అయిపో!” అన్నాడు.

“అలారండి దారికి!” నవ్వుతూ వంటింట్లోకి జారుకుంది శ్రీలక్ష్మి.



దయానంద్‌కి ఫోన్ చేసాడు. చాలా సేపటి వరకూ ఎత్తలేదు. ఇంక ఫోన్ కట్ చేసేద్దామనుకునే సరికి ఫోనెత్తాడు దయానంద్.

“ఏమిటిరా ఫోన్ ఎత్తడానికి ఇంతసేపు?” అడిగాడు విసుగ్గా.

“ఇంకా రౌండ్ పూర్తవలేదురా! ఇంతలో నువ్వు ఫోన్ చేసావు!” జవాబిచ్చాడు దయానంద్.

టైము చూసుకున్నాడు శ్రీకాంత్.

“ఏంటి! ఇంకా రౌండ్లో ఉన్నావా?...సరే! నీ పని నువ్వు చూసుకో!... నేను ఇవాళ ఆఫీసుకి సెలవు పెట్టానులే!... ఇప్పుడే బార్ కి బయలుదేరుతున్నా! మన బాబూరావుని వెంటబెట్టుకొని అక్కడికి వచ్చేస్తున్నా! నీ రౌండ్లు పూర్తి కాకుండానే నిన్ను కలుసుకుంటాం మేము సరేనా!” అని ఫోన్ పెట్టేసాడు.

మనిషి వంటింట్లో ఉన్నా, ఆమె చెవులు మాత్రం శ్రీకాంత్ మాటలను ఆమె మెదడుకి చేరవేసాయి. శ్రీలక్ష్మికి కోపం నసాళానికి అంటింది.

“ఏమిటీ! బాబురావుని వెంటబెట్టు కొని, బార్‌కెళ్ళి మీ ఫ్రెండ్‌తో కలిసి రౌండ్లేస్తారా? మీకెంత ధైర్యం!” అని నిలదీసింది.

“నేను బార్‌కెళ్తే నువ్వెందుకు బేర్ మంటున్నావు?” అర్థంకాక అడిగాడు.

“మీరలా బార్లో తాగి తందనాలాడితే ఊరుకుంటానా?... మూడు చెరువులు కాదు ముప్పై చెరువుల నీళ్ళు తాగిస్తా!” అంది ఝాన్సీరాణిలా.

అప్పుడు అర్థమైంది శ్రీకాంత్‌కి. పెద్దగా నవ్వి “ఓ అదా!... నా స్నేహితుడు బాబూరావు, వకీలు... వాడ్ని ‘బార్లో’ కలుసుకొని, ఇద్దరం కలిసి హాస్పిటల్లో ‘రౌండ్లు’ వేస్తున్న డాక్టర్ దయానిధిని కలుసుకుంటాం. ఉగాదినాడు మా పూర్వ విద్యార్థుల సమావేశం ఉంది కదా?... ఆ ఏర్పాట్లు చూడటానికి!” అనేసి బయటకు వెళ్ళిపోతున్న భర్తవైపు గుడ్లప్పగించి చూసింది శ్రీలక్ష్మి.



డి వి డి ప్రసాద్,
9437094331

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# హన్నన్నా


భార్యాభర్తలిద్దరూ టీవీ చూస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం దగ్గర గొడవైందని విని న్యూస్ పెట్టాడు నూకరాజు. అక్కడ లైవ్ వస్తోంది.

ఏదో సంఘ కార్యకర్తలు, తమకి న్యాయం చెయ్యాలంటూ అరుస్తున్నారు. ముఖ్యమంత్రిని కలుస్తామని గొడవ చేస్తున్నారు. ముందుకి దూకుతున్నవాళ్లలో ఆడవాళ్లే ఎక్కువగా ఉన్నారు.

వాళ్లందరినీ మహిళా కానిస్టేబుల్స్ వెనక్కి తోసేస్తున్నారు... సన్నగా చువ్వలా ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్ అందరికంటె ఎక్కువగా ఆడవాళ్లని వెనక్కి తోసేస్తోంది. ఎదురు తిరిగిన వాళ్లని అడ్డమైన బూతులూ తిడుతోంది. చెట్టంత లావున్న ఆడదాన్నైనా సరే, జబ్బ పట్టుకుని ఒక్క నెట్టు నెడుతోంది...

ఆమె చేతి విసురుకి పాపం వాళ్లు అల్లంత దూరాన వెళ్లి పడుతున్నారు.

"నా తల్లే... ఏ ఇంటి కోడలవుతుందో గాని అత్తగార్ని కూడా ఇలాగే గెంటేసేటట్టుంది మహాతల్లి!" మెటికలు విరిచింది నాంచారమ్మ



నూకరాజు నవ్వేడు.

"నీలాంటి అత్తగారైతే సీను రివర్సవుతుందిలే!"

"మరేం బాగా చెప్పేరు. నా దగ్గర ఇలాంటి పప్పులుడకవ్!" అంది నాంచారమ్మ.

మనసులో మాత్రం... "మీ అమ్మని గెంటేసినప్పుడున్న ఓపిక ఇప్పుడు లేదు. దిక్కుమాలిన బీపీలూ సుగర్లూ చెండుకు తింటున్నాయి. కోడల్ని అదుపులో ఉంచాలంటే నోటిపవరే దిక్కు!" అనుకుంది.

వెంటనే ఆమెకి కొడుకు ఎవరో పిల్లని ప్రేమించాననీ... సాయంత్రం తీసుకొచ్చి చూపిస్తానని చెప్పిన విషయం గుర్తొచ్చింది.

అనుకున్నట్టే ఎవరో అమ్మాయిని తీసుకొచ్చాడు నర్సింగ్. 'మహాలక్ష్మి' అని పరిచయం చేశాడు. పిల్ల చక్కగా చీర కట్టుకుని తల్లో పువ్వులు పెట్టుకుని నవ్వుతూ మహాలక్ష్మిలాగే ఉంది.

"నాతోనే చదువుకుంది... ఉద్యోగం కూడా చేస్తోంది." నర్సింగ్ చెబుతూ ఉండగానే మధ్యలో అడ్డొచ్చాడు నూకరాజు.

"నిన్ను ఎక్కడో చూసినట్టుందమ్మా..." అంటూ.

నర్సింగ్ ఉత్సాహంగా తండ్రి వైపు తిరిగాడు...

"ఈ రోజు టీవీలో గాని చూశావా నాన్నా! లక్ష్మినే ఎక్కువగా చూపించారు. తను పోలీస్ కానిస్టేబుల్. ముఖ్యమంత్రి కార్యాలయం దగ్గర జరిగిన గొడవలో చాలా యాక్టివ్‌గా డ్యూటీ చేసింది" చెబుతూ పక్క నుంచి దబ్బుమని శబ్దం విని ఉలిక్కిపడి తిరిగి చూశాడు.

అప్పటికే స్పృహ తప్పి పడిపోయి ఉంది నాంచారమ్మ.

"హన్నన్నా!..." అనుకున్నాడు నూకరాజు మనసులోనే!!



లక్ష్మీ గాయత్రి,
6302555947



ప్రత్యేక బహుమతి పొందిన కథ

# అదొక్కటే

హాస్పిటల్ మెట్లు ఎక్కుతూ కూడా రమ్య ఒక్కసారిగా తొట్రుపాటుకు గురైంది.


'భగవంతుడా వీరి సమస్యను నీవే పరిష్కరించాలయ్యా!' అంటూ మెట్లు ఎక్కి... వార్డు వైపు నడిచింది భారంగా...ఆనందంగా... ఆతృతగా!

అసలు అంత సమస్య ఏమీ లేదు. పట్టు విడుపులకు పోయి సమస్యగా మార్చుకొని వేలాడుతున్నారు ఇద్దరూ. సందీప్, సుష్మలిద్దరూ తన కొలీగ్స్. ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకున్నారు.

కుటుంబాలలో అభ్యంతరాలు మామూలే... పెళ్లి కాని రమ్య కూడా పెద్ద మనిషి పాత్ర వహించి... ఒప్పించి అన్నీ కుదిర్చి అందరినీ ఏకం చేసి పెళ్లి పందిరి వరకు నడిపించింది.

అంతా బావుంది ఏడాది వరకు. సుష్మ ప్రెగ్నెన్సీ సమస్యగా మారింది.

సందీప్ అబ్బాయి కావాలంటాడు... సుష్మ నథింగ్ డూయింగ్... అమ్మాయే అంటుంది... ఇది మామూలే... ప్రతి ఇంట్లో, ప్రతి దంపతుల్లో పెనుగులాట ఉంటానే ఉంటుంది. కానీ సుష్మ, సందీప్‌లలో ఆ విషయం పతాకస్థాయికి వెళ్ళింది. పంతాలుకు పోయారు. పట్టుదలగా మారింది.



"కూతురు పుడితే నీ ముఖం కూడా చూడను!" అనటమే కాదు, తొమ్మిదవ నెల వచ్చినా అదే మాట. అంతే ముభావంగా కూడా ఉంటూ వచ్చాడు.

సందీప్ మొండితనం సుష్మకు బాగా తెలుసు. రమ్యకు సమస్యను ఫీడింగ్ ఇస్తూ వచ్చింది. ఎవరి మాట చెవిన వేసుకోలేని మొండిఘటంగా తయారయ్యాడు

✦✦✦

ఎవరు పుట్టారో... వీరి సమస్యకు పరిష్కారం ఏమిటో? భాగంతుడా నీవే కాపాడాలి వీరిని! నీవే పరిష్కరించాలి. ఆలోచిస్తూనే... నెమ్మదిగా సుష్మ రూంలోకి నడిచింది. ఒక్కత్తే ఉంది.


పొత్తిళ్ళలో బిడ్డను చూసింది. అంతా సుష్మనే. ముక్కు, కళ్ళు, చిన్, రంగు అంతా సుష్మ.

అమ్మాయే అనుమానం లేదు. రమ్యకు గుండెల్లో రాయి పడింది. అదే అడిగాను...

"సందీప్ ఏమంటున్నా" దని.

"ఏముంది ఇద్దరం హ్యాపీ... బిడ్డ అంతా నన్ను తీసి పెట్టింది... అదొక్కటే ఆయనది!" చాలా సునాయసంగా బదులిచ్చింది సుష్మ.

రమ్యకు అర్థం కాలేదు. అసలు విషయం బుర్రలో వెలిగేటప్పటికి రమ్యకు ఐదు నిమిషాలు పట్టింది.



ఈత కోట సుబ్బారావు,
9440529785

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# ముఖాలు చూసుకుందాం!

"నాన్నా! ఫ్రెండ్స్‌తో సినిమాకెళ్తున్నాను. అయిదొందలు కావాలి!" కూతురి నుంచి వాట్సాప్ మెసేజ్.

"మీ అమ్మనడిగి తీసుకో మౌనికా!" సుబ్బారావు బదులిచ్చాడు.

"అమ్మ టీవీలో 'అంతులేని కథ' సీరియల్ చూస్తొంది. డిస్టర్బ్ చేస్తే నన్ను చీల్చి చెండాడేస్తుంది."

"సరే.. ఫోన్‌పేలో పంపిస్తాను."

కొంతసేపటి తర్వాత... "హలో! నేను సీరియల్ చూస్తున్నాను. ఇదయ్యాక వంట మొదలుపెడితే లేటవుతుంది. ఈ రోజుకి జొమాటోకి ఆర్డర్ పెట్టరా ప్లీజ్?" అంటూ భార్య సుమతి నుంచి మెసేజ్.

"ఏం ఆర్డర్ చెయ్యాలి?"


"మౌనికను మీకు మెసేజ్ చెయ్యమంటాను."

✦✦✦

"ఆ జొమాటోవాడు కాల్ చేశాడు. ఇంటి బయట వున్నాడట.వెళ్ళి తీసుకో సుమతీ!"

"అబ్బ!..సీరియల్ మంచి పట్టులో ఉందండి. కాస్త మీరే వెళ్ళి తీసుకుందురూ."

"మా మేధావుల గ్రూపులో 'నేటి కుటుంబాలలో మానవ సంబంధాలు' సబ్జెక్ట్ మీద చర్చ వాడిగా, వేడిగా నడుస్తొంది. నువ్వే వెళ్ళి తీసుకో!"



"నా వల్ల కాదు. మీరు వెళ్ళి తీసుకుంటే అందరం తింటాం... లేదా అందరూ పస్తుంటాం!"

"మీ ఫ్రెండు బైకు అమ్ముతున్నాడని చెప్పారు కదా! టీవీలో క్రికెట్ మ్యాచ్ ఇంటరెస్టింగ్‌గా ఉంది. మీరెళ్ళి చూసి రండి నాన్నా!" కొడుకు నుంచి మెసేజ్.

"నేను బిజీ... నువ్వెళ్ళు! లొకేషన్ పెడతాను."

"బైక్ ఫోటో వాట్సాప్‌లో పెట్టమనండి. నాకు నచ్చితే వెళ్ళి కలుస్తాను."

గంట తరువాత...

"నేను పుద్దు నలుగురికి ఆర్డర్ చెయ్యమంటే మీరు ఇద్దరికే ఆర్డర్ ఇచ్చినట్లున్నారు. నాకేమీ మిగల్లేదు. మీకు చేతిలో సెల్ ఉంటే ఇంకో విషయం పట్టదు!" సుమతి మెసేజ్.

"నేను నలుగురికే చెప్పాను. ఎలా అయిపోయిందో నాకు అర్థం కావట్లేదు."

ఇంతలో అతనికి కొత్త నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది.

"సుబ్బారావుగారికి... మేము మీ అమ్మాయిని చూడటానికి ఈ రోజు వస్తున్నామని మీకు ఉత్తరం రాశాను. అన్నట్టే ఉదయం పదకొండు గంటలకు నేనూ, నా భార్యా మీ ఇంటికి వచ్చాము. ఇంట్లో మీరెవరూ కనిపించలేదు. మీ అబ్బాయీ, అమ్మాయీ సెల్‌లో మాట్లాడుతూ అటూ ఇటూ తిరుగుతూ కనిపించారు. అలా మేము అమ్మాయిని చూడటం జరిగింది. అక్కడే మీ అమ్మాయి ఫోటో తీసి మా అబ్బాయికి వాట్సాప్‌లో పంపాను. వాడికి అమ్మాయి నచ్చింది. ఇంతలో జమేటో వాడు వస్తే పార్సల్ అందుకుని, కాసేపు మీకోసం ఎదురుచూసి, తర్వాత ఆకలిగా ఉంటే మేమిద్దరమూ భోజనం చేసి, ఇప్పుడే మా ఇల్లు చేరాము. పెళ్ళిచూపుల కోసం త్వరలో జూమ్ కాల్ లింక్ పంపిస్తాను. మా ముఖాలతో పాటు మీ ఇంట్లోవారి ముఖాలు కూడా మీరు చూసుకోవచ్చు!

...... రామారావు"





సి.ఎన్.చంద్రశేఖర్,
9490050214



ప్రత్యేక బహుమతి పొందిన కథ

# సీరియల్ కిల్లర్


నరసింహంకు పేపర్‌లో ఆ వార్త చదివినప్పటి నుంచి ఎంతో ఉద్విగ్నంగా ఉంది. తనకు నరసింహం అని ఎందుకు పేరు పెట్టారో అని బాధ పడేవాడు. కానీ ఆ పేరు పెట్టినందుకు సంతోషపడుతున్నాడు.

'కనిపించే మూడు సింహాలు ధర్మానికి, న్యాయానికి, చట్టానికి ప్రతీకలైతే కనిపించని ఆ నాలుగో సింహమే పోలీస్!' అవును! తాను నాలుగో సింహం. తన పేరు నరసింహం! ఎస్.ఐ. నరసింహం అనుకుంటూ పూనకం వచ్చినవాడిలా అద్దం ముందు నిల్చొని ఊగిపోయాడు.

తను ఎస్.ఐ.గా సెలక్ట్ అయి ట్రైనీ ఎస్.ఐ.గా ఆ ఊరి పోలీస్‌స్టేషన్‌లో డ్యూటీ వేసారు. అద్దం ముందు నిల్చొని 'నేనూ, సింహం ఒకటే. అది గడ్డం గీసుకోదు, నేనూ గీసుకోను. ఎందుకంటే ఉద్యోగం వచ్చినందుకు తిరుపతి మొక్కు' అనుకుంటూ తన బవిరి గడ్డం నిమురుకున్నాడు.

'నగరంలో సీరియల్ కిల్లర్ ప్రవేశించి, విచిత్రంగా మనుష్యులను చంపుతున్నాడని, ఆ సైకో కిల్లర్ పట్ల జాగ్రత్త!" అంటూ పేపర్‌లో ప్రకటన వచ్చింది.

ఆరోజు రాత్రి నరసింహం తన బైక్ తీసాడు. వేషం మార్చాడు. రాత్రయినా నల్ల కళ్లద్దాలు పెట్టుకున్నాడు. వేసవికాలం ఉక్కబోస్తున్నా ఉలెన్ కోట్ తొడుక్కొని, చేతులకు గ్లౌజ్ వేసుకున్నాడు. ఎఫెక్ట్ కోసం అలవాటు లేకపోయినా సిగరెట్ వెలిగించి నోట్లో పెట్టుకున్నాడు. అలా అన్ని లాంఛనాలతో ముందుకు కదిలాడు. నగరంలో ఎక్కువమంది వుండే కూకట్‌పల్లి కాలనీలో... రాత్రి తొమ్మిది దాటింది. అంతా నిశ్శబ్దం.



ఇంతలో ఎవరో వ్యక్తి పరిగెత్తుకుంటూ ఇంటి గోడ దూకిన శబ్దం వినిపించింది. ఇంతలో ఇంటివారి కుక్క 'భౌ' మంటూ మొరిగింది. గబగబా వెళ్లి తలుపులు కొట్టాడు. ఇంట్లోవాళ్లు తలుపులు తెరిచారు.

"సీరియల్ కిల్లర్ వచ్చినట్టున్నాడు మీ ఇంట్లోకి!" అన్నాడు.

"వచ్చేసాడు!" అంది తలుపు తీసిన పెద్దావిడ.

ఆ మాటలకు ఆశ్చర్యపోతూ– "వచ్చేసాడని అంత మెల్లగా చెప్తున్నారేం... ఏం చేస్తున్నారు?" అన్నాడు.

"చూస్తున్నాం!" చెప్పింది ఆ పెద్దావిడ మళ్లీ.

"ఏది, నన్ను చూడనీ..." అంటూ ఇంట్లోకి నడవబోయాడు.

"ఏం? మీ ఇంట్లో లేదా?" అంది.

ఆవిడ మాటల్ని వినిపించుకోకుండా గబగబా ఇంటి లోపలికి ప్రవేశించాడు. అంతా టీవీ ముందు కూర్చొని మధ్యకు వచ్చిన ఆగంతకుడికి కేసి విసుగ్గా చూసారు. "పోనీలే ఈయన్ని కూడా చూడనియ్యండి" అంటూ ఆ పెద్దావిడ "కూర్చోబాబూ!" అంటూ సోఫా చూపించింది.

అర్థంకాక అలా చూస్తోన్న నరసింహం టి.వి.లో సీరియల్ కిల్లర్, మొదటి భాగం వెబ్ సిరీస్ అనే ప్రకటన వచ్చేసరికి అసలు విషయం అర్థమైంది.

పత్రికల్లో ఆ వెబ్ సిరీస్ ప్రకటన పబ్లిసిటీ కోసం ఇచ్చారని తెలుసుకోకుండా వచ్చినందుకు సిగ్గుపడ్డాడు. ఆ సీరియల్ కిల్లర్ చంపకుండానే బిక్కచచ్చిపోయాడు. మరైతే ఇంట్లో గోడ ఎవరు దూకినట్టు? అదే ఆ పెద్దావిడను అడిగాడు మెల్లగా.

ఆమె కూడా రహస్యంగా– "మా మనవడు. సినిమాకి వెళ్లి వచ్చాడు. వాళ్ల నాన్న తిడతాడని గోడ దూకినట్టున్నాడు!" అంటూ పకపకా నవ్వింది.

తన నెత్తిమీద టోపీ ముందుకు లాక్కొని తన మొహం ఎవరికీ కనబడనియ్యకుండా బతుకు జీవుడా అంటూ బైటికి నడిచాడు ఎస్.ఐ. నరసింహం.



డాక్టర్ ఎమ్ సుగుణ రావు,
9393129945

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# కళ్యాణం చూతము రారండి!

నేను, ఓ పత్రిక నిర్వహిస్తున్న కథల పోటీకి కథ రాద్దామని వేలిని సిద్ధం చేసుకుని... సెల్ ఫోన్‌లోని నోట్‌ని తెరవబోతుంటే ఇంతలో ఇన్‌కమింగ్ కాల్... నా చిన్ననాటి స్నేహితుడు చంద్రకాంత్ నుంచి.

ఆన్సర్ బటన్ నొక్కి, "హలో కాంత్... అంతా కుశలమేనా? పెళ్ళి పనులు ఎంతవరకూ వచ్చాయి?" అని అడిగాను.

"ఆఁ... జరుగుతున్నాయి. ఇంతకీ నీకు ఎందుకు ఫోన్ చేశానంటే... మెనూ గురించి అడుగుదామని... నీకు వాట్సాప్‌లో మెనూ చార్ట్ పెట్టాను చూడు!" అన్నాడు.

"మెనూ చార్టా...?" అర్థం కాక నోరెళ్ళబెట్టాను.

"అవును... నీకు ఏం ఐటమ్స్ కావాలో చూసి మెసేజ్ పెట్టు!" అన్నాడు వాడు.

నాకు ఏమీ అర్థం కాలేదు.

'ఏంటి వీడు జోక్ చేస్తున్నాడా?... లేక నిజంగానే అంటున్నాడా?'


"అది కాదు కాంత్!... వచ్చే అతిథులందరికీ ఇలాగే వాళ్ళకు ఇష్టమైన ఐటమ్స్‌తోనే భోజనాలు ఏర్పాటు చేస్తున్నావా?... ఇలా చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని కదా?" అన్నాను నేను.

"కష్టమేముంది? స్విగ్గీ మరియు జొమాటోకు ఆర్డర్ చేయడమే కదా!" అన్నాడు కాంత్.

ఈ మాటతో అదిరిపడ్డాను నేను. కొంపదీసి ప్రపంచంలోనే ఇలా చేస్తున్న మొదటి పెళ్ళిగా గిన్నీస్ రికార్డు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడా వీడు!

రెండు సెకన్లలో తమాయించుకుని...

"స్విగ్గీ... జొమాటాల్లో ఆర్డర్ చేయాల్సినంత అవసరమేముంది? నువ్వు సరే అంటే... నాకు తెలిసిన ఓ మంచి కేటరింగ్ వుంది. రుచికి, శుచికి పెట్టింది పేరు.... మాట్లాడుతాను" అన్నాను.



వాడో రెండు మూడు సెకన్ల తరువాత... "నువ్వు చెప్పే కేటరింగ్ వాళ్ళు... డోర్ డెలివరీ చేస్తారా?" అని అడిగాడు.

"డోర్ డెలివరీ ఏం ఖర్మ!... లోపలికొచ్చి నిక్షేపంగా వడ్డించనూ వడ్డిస్తారు.... ఇంతకీ నువ్వు చెబుతున్నది మీ ఇంటి డోరా?... కళ్యాణ మండపం డోరా?" అని అడిగాను.

వాడు నింపాదిగా– "రెండూ కాదు... అతిథుల ఇంటి డోర్లు!" అన్నాడు.

ఆ మాటతో నా మైండ్ బ్లాక్ అయ్యింది. కాస్త తెపరాయించుకుని "అతిథుల ఇళ్ళకే విందు భోజనమా? అంటే పెళ్ళికి రావద్దనేనా నీ ఉద్దేశం?" అన్నాను.

అందుకు వాడు– "రావొద్దని ఎవరంటారు? పెళ్ళి అనేది జీవితంలో ఓ మహత్తర ఘట్టం. వచ్చిన అతిథుల ఆశీర్వాదాలలో ఎవరిదో ఒకరిది పని చేయక పోతుందా?... అని పెళ్లి పెద్దల ఆశ! కానీ పెళ్ళికి వచ్చిన అతిథులు పెళ్ళి వరకూ ఎవరు ఉంటున్నారు. భోంచేసి బయలుదేరేస్తున్నారు. అందుకే వాళ్ళని ఇబ్బంది పెట్టకుండా భోజనాలను వాళ్ళ ఇళ్ళకే పంపించడానికి ప్రయత్నం చేస్తున్నాం. సరే ఉంటాను. నువ్వూ మెనూ చూసి నాకు మేసేజ్ పెట్టు... ఇంకా చాలా మందికి కాల్ చేయాలి" అంటూ ఫోన్ కట్ చేశాడు.

నాకు నోట మాట రాలేదు! రాదు కూడా!!





దాసరి చంద్రయ్య
9440407381

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# చేదు పచ్చడి

'ఏంటబ్బా!... ఈ రోజు సంతోష్ నుంచి కాల్ రాలేదు.' అని సౌమ్య మనసులో అనుకుంటుండగానే సంతోష్ కాల్ రానే వచ్చింది.

"హాయ్ డార్లింగ్!... ఏం చేస్తున్నావు?...ఇంకేంటి సంగతులు? అన్నట్టు చెప్పడం మర్చిపోయా... నీకోసం ఒక పార్సెల్ పంపిస్తున్నాను... అందరి ఆడవాళ్లకు ఇష్టమైన ఆషాఢ మాసం స్పెషల్ కానుక స్పెషల్‌గా నీ కోసం అమ్మ, నేను రెడీ చేసి పంపిస్తున్నాము. కాబట్టి దానిని నువ్వు ఒక్కదానివే వాడుకో డార్లింగ్!" అని అంటుండగానే...

"ఏంటబ్బా!... చెప్పొచ్చు కదా అండి సస్పెన్సా?" అని సౌమ్య అనగానే...

"ఆc... అవును డియర్ ఎలాగూ రేపు పార్సెల్ వస్తుంది కదా చూడు. సరే మరి ఇక బాయ్!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

మరురోజు ఉదయం పార్సల్ రాగానే... ఎంతో ఆత్రుతతో నాకోసం సంతోష్ ఏమి పంపించాడని పార్సల్ ఆత్రుతతో విప్పి చూస్తూ... 'ఏంటిది? ఆషాఢం స్పెషల్ అన్నాడు. కవర్లో చూస్తేనేమో ఏదో పచ్చడిలా అనిపిస్తుంది. గోంగూర పచ్చడిలా ఉంది! ఆషాఢంలో గోంగూర పచ్చడి స్పెషలేమో వాళ్ళ ఊర్లో!' అనుకొంటూ సంతోష్ పంపించిన కవర్లోని మొత్తం వేసుకొని... అన్నంలో కలుపుకొని ముద్ద పెట్టుకుంది!



'ఏంటి !చాలా చేదుగా ఏదోలా ఉంది ఈ పచ్చడి!' అనుకొని సరేలే... మావారు మా అత్తమ్మ చాలా ప్రేమగా... దీన్ని పంపించారు. ఎలాగో అలా దీన్ని తినేయాలి!..." అను కుంటూ మొత్తం లాగించేస్తుంది.

ఎప్పటిలాగానే ఆరోజు రాత్రి సంతోష్ ఫోన్ చేయగా– "హాయ్!..." అని సంతోష్ మాట్లాడుతుండగానే మధ్యలోనే "ఏమండీ మీరు పంపించిన పార్సెల్ వచ్చింది. గోంగూర పచ్చడి చాలా బాగుంది. కాకపోతే ఏమి ఎక్కువ అయిందో ఏమో కానీ ఈ రోజు మొత్తం నాకు విరోచనాలు ఉదయం నుంచి ఓపిక లేకుండా ఇలాగే కూర్చుండి పోయా అండి!" అనగానే....

ఒక్కసారిగా సంతోష్– "ఏంటి! నేను గోంగూర పచ్చడి ఎప్పుడు పంపించానబ్బా?!... ఓసి నీ యంకమ్మా! అది గోంగూర పచ్చడి కాదే తల్లి! ఆషాఢమాసంలో అందరూ పెట్టుకునే గోరింటాకు! నీ సిటీ తెలివి తగిలేయ్య!"

లోపటి నుంచి వస్తున్న నవ్వును ఆపుకోలేక ఐదు నిమిషాల పాటు ఫోను పక్కన పెట్టి అలాగే నవ్వుతూ ఉండిపోయాడు.

ఆ మాటలు విన్న సౌమ్య నెత్తిపై చేయి పెట్టుకొని... కిందపడి పగలబడి నవ్వింది... గోరింటాకుకు... గోంగూర పచ్చడికి... కూడా తేడా తెలియక తిన్నానా!" అని.

సౌమ్య పరిస్థితి తలుచుకొని 'నాకెక్కడ దొరికావే నువ్వు!' అని మరోసారి పగలబడి పడిపడి నవ్వుకున్నాడు సంతోష్.



కొత్త ప్రియాంక (భానుప్రియ)
9553352929

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# షరతు

**ఆ**నందరావు దంపతులకు తమ అయిదేళ్ళ కొడుకుని ఎప్పుడు చూసినా వాడి ముఖంలో ఓ ఐ.ఏ.ఎస్సో...లేదా ఓ ఐ.పి.ఎస్సో కనపడుతుంటాడు.

అలాంటి కొడుకుని కన్నందుకు మురిసిపోతుంటారు. దానికి కారణం ఆ సిటీలో డాక్టర్లు, ఇంజనీర్లు, ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్‌లను తయారు చేసే(అందరు అనుకునే) హార్డ్ రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో పావు కేజీ అదే ఎల్‌కేజీలో వాడికి సీటు రావడమే. ఎవరికో గాని దక్కని అదృష్టం తమకు పట్టిందని ఆనంద పడ్డారు.

ఆ స్కూల్లో సంవత్సరానికి లక్షన్నర ఫీజు అయినా పర్వాలేదనుకున్నారు.

ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజనీర్లే. నెలకు ఐదు లక్షల వరకు వస్తుంది. సొంత ఇల్లు, వెనుక కొంత ఆస్తి కూడా ఉంది. ఒక్కడే కొడుకు కాబట్టి ఎంత ఖర్చయినా భరించగలమనుకున్నారు.


అడ్మిషన్ రోజున ఫీజు అమౌంట్ తీసుకుని పిల్లాడితో వాళ్ళు చెప్పిన సమయానికి స్కూలుకి వెళ్ళారు.

అప్పటికే చాలామంది తమ పిల్లలతో వచ్చి ఉన్నారు.

తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. ఒక్కొక్కరిని పిలుస్తున్నారు.

వాళ్ళు పిల్లలను తీసుకుని లోపలికి వెళుతున్నారు. తిరిగొచ్చిన వారిలో కొందరి ముఖాలు వెలిగిపోతూ ఉంటే మరికొందరి ముఖాల్లో దిగులు కనిపిస్తూ ఉంది.

ఆనందరావు వంతు రాగానే దంపతులిద్దరూ పిల్లాడిని తీసుకుని లోపలికెళ్ళారు.



స్కూలు మేనేజుమెంటు వారు సాదరంగా ఆహ్వానించారు. వారడిగిన వివరాలను వారికి అందించారు. అవన్నీ చూసి, "మీరు మరొక డాక్యుమెంటు ఇవాల్సి ఉంటుంది" అని... ఆ డాక్యుమెంటు పేరు చెప్పారు.

అది విన్న వెంటనే బిత్తరపోయి... "అది ఎందుకండి?" అన్నారిద్దరూ ఒకేసారి.

"చూడండి! మీరు మీ అబ్బాయిని టెన్త్ క్లాసు వరకు ఇక్కడే చదివించాలన్న కండిషన్‌కి ఒప్పుకునే వచ్చారు. అంతకాలం పాటు ప్రతి యేట ఫీజు కడుతూనే ఉండాలి. అయితే మీ పిల్లాడిని మధ్యలో మానిపించినా, లేదా మీ ఆర్థిక పరిస్థితి దెబ్బ తిన్నా... అంటే మీ ఇద్దరివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, అవి ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు ఊడతాయో తెలియదు. అటువంటప్పుడు మాకు నష్టం వస్తుంది కదా! దాన్ని భర్తీ చేసుకోవడానికే మేము ఈ షరతు పెట్టాము. దానికి మీరు ఒప్పుకుంటేనే మీ పిల్లాడికి సీటు ఇస్తాము."

ఇంతకీ వాళ్ళు పెట్టిన 'షరతు' వాళ్ళ ఆస్తి లేదా ఇంటికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజుల్ని పిల్లాడి టెన్త్ పూర్తయ్యేవరకు స్కూల్లోనే ఉంచాలి!

ఏం చెప్పాలో అర్థం కాక ఒకరిముఖం ఒకరు చూసుకుంటూ అలానే ఉండి పోయారా జంట!




**కట్టా రాంబాబు,**
**9440140510**

సరికొత్త సరదా శీర్షిక

# వాక్చిత్రం

సుధామ-9849297958



## ‘పచ్చడి’ మెచ్చునిచో ‘తొక్కు’!

**‘పికిల్స్’ అనీ, ‘చట్నీ’ అనీ స్టైలిష్‌గా పిలుస్తున్నారు కానీ... పచ్చడి అనడంలో శుభకరమైన ‘పచ్చ’ ఉంది. మనిషికి అవసరమైన విటమిన్ ‘డి’ కూడా ఉంది.**

**అంచేత ‘పచ్చడి’కి మించిన ఆహార పదార్థాం లేదుస్మీ!...**

**‘పచ్చడిమెతుకులు’ అంటాం! అది కనీస సగటు భోజనానికి గుర్తు!**

వందలు, వేలు పెట్టి హోటళ్ళలో తినడం కన్న... ఇంట్లో పచ్చడి మెతుకులు తిన్న ఆ తృప్తి... ఆనందం వేరు.

ఆరోగ్యానికి పచ్చడి మెతుకులు బెస్ట్!

అసలు తెలుగు సంవత్సరాది అనే ‘ఉగాది’ని అంచేతే మనం ‘పచ్చడి’ తోనే మొదలెడతాం.

శ్రీ క్రోధి నామ సంవత్సరంలోకి ఈ నెల తొమ్మిదిన ప్రవేశిస్తున్నాం! క్రోధి కదా అని ‘ఆవకాయ పచ్చడి’నే గుర్తు చేసుకోకండి!

కారం... ‘కారం’ అంటే మనకు మమకారం, ఉపకారం, సహకారం అన్నింటిలో ఓ పద్ధతి ప్రకారం ఉంటుంది. ఉండాలి కూడాను.

క్రోధిలో మన కారం అంతా అవే కావాలని శుభాకాంక్షిద్దాం!

సరేకానీ... ఉగాది పచ్చడితోనే మన కొత్త సంవత్సరం మొదలవుతుంది... షడ్రుచుల పచ్చడిగా జీవితంలో అన్నింటినీ స్థితప్రజ్ఞతతో స్వీకరించడానికి సంసిద్ధమనే ఆ ‘పచ్చడి’తో మన జీవన గమనాన్ని ముడేసుకున్నాం మనం!

పచ్చడిని కొందరు ‘తొక్కు’ అంటారు!

ఈ తొక్కేయడం ఏమిటి అనుకోకండి!

పైకి రావాలంటే ‘తొక్కు’ తప్పనిసరి! అవసరమైతే సినిమాలో హీరో విలన్ను ‘పచ్చడి’ కింద చితక్కొట్టి తొక్కేసినట్లు అవరోధాల్ని, ఆటంకాల్ని తొక్కేసి పైకి రావాలి మరి!

చూసారా! పాజిటివ్‌కూ, నెగిటివ్‌కూ రెండింటికి కూడా ‘పచ్చడి’ యే వాడతాం మనం!

తెలుగువాళ్ళకు తెలిసినన్ని పచ్చడి రుచులు మరొహరికి తెలియవేమో! ఉగాది పచ్చడిలో తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే షడ్రుచులనూ మిళాయిస్తాం!... అది మొదలు సంవత్సరం పొడుగునా ‘పచ్చడి’ టోర్నమెంట్ రకరకాలుగా జరుగుతూనే వుంటుంది మరి!

వైజాగ్‌లో భీమవరం పికిల్స్ అనే షాప్‌లో శాకాహారంవి యాభై రకాల ‘పచ్చడి’లు, కాంబినేషన్ పచ్చడిలు అంటూ ఓ విశేషం కూడాను!

టమాటా కొత్తిమీర, పండుమిర్చి మామిడల్లం, గోంగూర పచ్చిమిర్చి అని... ఇలా జంట పెనవేసిన ‘పచ్చడి’ రకాలు కూడా ఇవాళ ప్రాముఖ్యం వహించి అందుబాటులోకి వచ్చేసాయి.




'మాయాబజార్' సినిమా వచ్చాక గోంగూర పచ్చడి డిమాండ్ మరీ పెరిగిపోయిందని ఆ రోజుల్లోనే చెప్పుకునేవారట!

నాగరికుల విందు భోజనంలో తప్పనిసరిగా వుండవలసిన పదార్థంగా పేరొన్నది 'పచ్చడి'నే తప్ప వేరొకటి కాదు.

శాకంబరీదేవి ప్రసాదం, ఆంధ్రశాకంగా 'గోంగూర' కున్న ప్రాధాన్యం నాటికీ, నేటికీ ద్విగుణీకృతమే తప్ప ఏమీ తగ్గలేదు కదా!

సరే! ఇంక పచ్చడి రకాల క్రమం మొద లెడితే పన్నీర్, మష్‌రూమ్, కాజూ పికిల్ అని... కొత్త కొత్త రకాలు కూడా చేరి విదేశాలలో కూడా విస్తారంగా ఎగుమతి అయిపోతు న్నాయి. నాన్‌వెజ్ మాంసాహార పచ్చళ్ళు కూడా బోలెడొచ్చేసాయి.




వంకాయపచ్చడి, బెండకాయపచ్చడి, దొండ కాయ పచ్చడి, కాకరకాయ పచ్చడి, క్యారెట్ పచ్చడి, పచ్చిమిర్చిపచ్చడి, ఎండుమిర్చిపచ్చడి, ఉసిరికాయ పచ్చడి, అల్లం పచ్చడి, పెసర పచ్చడి, కొబ్బరికాయపచ్చడి, టమాటా పచ్చడి, ఉల్లిపాయ పచ్చడి, వెల్లుల్లి పచ్చడి, పొట్లకాయ పచ్చడి, కొత్తిమీర పచ్చడి, ముల్లంగి పచ్చడి, అల్లం కొత్తిమీర పచ్చడి, టమాటా + కొత్తిమీర పచ్చడి, టమాటా పండుమిర్చి, గోంగూర ఎండుమిర్చి, కందిపచ్చడి, పల్లీ పచ్చడి... ఇలా రాస్తూ పోతే మొత్తం 'హాస్యానందం' నిండి పోవచ్చు ఆ వివరాలతో. పైగా ఇది పచ్చళ్ళ ప్రత్యేక సంచిక అయిపోయే ప్రమాదం ఉంది!

మీకు తెలుసుగా! 'రోటి పచ్చళ్ళు' అనేది ఓ స్పెషాలిటీ!

వాసిరెడ్డి వేణుగోపాల్ అనే ఆయన ఫేస్ బుక్‌లో దాని గురించి దంచికొట్టి ఓ పేజీయే సృష్టించారు. పుస్తకం కూడా అచ్చేసారు.

రోటి పచ్చడి బాగుంటుందా?...

మిక్సీ పచ్చడి బాగుంటుందా... అని ఓ డిబేట్ జరిగిందిట!

అసలు వేడి వేడి అన్నంలో పచ్చడి కలుపు కుని దాని మీద ఇంత నెయ్యో, వెన్నో, నూనో వేసుకుని కలుపుకుని ఓ ముద్ద తింటే చాలదూ! స్వర్గానికి ఓ బెత్తెడు దూరంలో వున్నట్లుగా ఆనందలోకాల్లో అమృతప్రాయంగా తేలిపోవ డానికి! చేసే చేతి మహత్త్యం వల్ల ఏదయినా పచ్చడిగా రాణించేస్తుందని బోలెడు కథలు కూడా ఉన్నాయి.


ఆకలితో నకనకలాడుతున్న ఓ రాజుగారికి ఓ సందర్భంలో ఓ పేదరాశి పెద్దమ్మ ఇంట్లో కూరా, నారా ఏమీలేక... పెరట్లో గడ్డి తెచ్చి పచ్చడి చేసి పెట్టిందట!

రాజుగారు జన్మలో దాని రుచి మర్చిపోలేక పోయారట. దేంతో ఆ పచ్చడి చేయబడిందో ఎప్పుడో అర్థం అయింది ఆయనకు. అయినా ఆ రుచి ఇచ్చిన 'పచ్చడి'... అన్ని ఐశ్వర్యాల ముందూ దిగదుడుపే అయింది.

ఆవకాయ, మాగాయ వుంటే... 'భోజనం దేహి' అని అసలు ఎవరినీ ప్రాధేయపడకుండా కాలం వెళ్ళమార్చేయచ్చని బ్రహ్మచారులకు బాగా తెలుసు! అంచేత 'పచ్చడి' భోజనానికి మూలాధార నాడి.

ఉగాది నుండి యుగాంతం వరకూ 'పచ్చడి' బ్రతుకులే సర్వ శుభంకరాలు!

అదీ సంగతి!!




ప్రముఖ కార్టూనిస్టు శ్రీ నాగిశెట్టి గారి
కార్టూన్ల సంకలనం
**నవ్వులు గ్యారెంటీ**
పుస్తక ఆవిష్కరణ
ది. 14.4.2024, 'బంగారుతల్లి పురస్కార ప్రదాన' సభలో




మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని పరిచయం చేస్తున్న శీర్షిక! 8

## 'ప్రసిద్ధ'

విజయవాడలో 65 ఏళ్ల క్రితం సిద్ధవరం వరప్రసాద్ అనే పేరుతో జన్మించారు. B. Com వరకూ అక్కడే చదువు.

1975 నుంచి కార్టూన్లు వేయడం మొదలుపెట్టారు. అన్ని తెలుగు పత్రికలే కాకుండా, కారవాన్, ఉమన్స్ ఎరా లాంటి ఇంగ్లీష్ పత్రికల్లో కూడా వీరి కార్టూన్లు చోటు చేసుకున్నాయి. ఇప్పటిదాక సుమారు 1500 కార్టూన్లు వేసిన శ్రీ ప్రసిద్ధగారు ఎక్కువ శాతం 'సామాజిక' అంశంపైనే కార్టూన్లు వేసారు.

సుదీర్ఘ విరామం తర్వాత, పేరులోని పొడి అక్షరాలతో 'ప్రసిద్ధ'గా కార్టూన్ రంగంలో పునరాగమనం చేసి, విరివిగా కార్టూన్లు గీస్తున్నారు.

విజయవాడ రైల్వేలో ఐదేళ్లు పనిచేసి, తర్వాత దేనా బ్యాంకులో చేరి, 2018లో రిటైర్ అయ్యి, ప్రస్తుతం ఒక కోఆపరేటివ్ బ్యాంకులో పని చేస్తున్నారు. భార్య పద్మలత, కొడుకు–దుష్యంత్, కోడలు–లోహితతో ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.


సామాజిక రుగ్మతలపై వీరు వేసే కార్టూన్లు, స్వేచ్ఛాలోచన అనే పత్రికలో ప్రతీ నెలా ప్రచురింపబడుతున్నాయి.


వివిధ కార్టూన్ల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్నారు.

హాస్యానందంలో ప్రముఖ రచయిత శ్రీయండమూరి వీరేంద్రనాథ్ నిర్వహించిన కార్టూన్ పోటీలో, శ్రీబాచి గారు నిర్వహించిన కార్టూన్ పోటీలో, శ్రీగుదిబండి వెంకటరెడ్డి నిర్వహించిన కార్టూన్ పోటీలో ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. కార్టూన్ వాచ్ ఆన్లైన్ మ్యాగజైన్ నిర్వహించే కార్టూన్ పోటీల్లో పలుమార్లు బహుమతులు గెలుచుకున్నారు.

జి.వి.ఆర్ కార్టూన్ పోటీలో తనకి మొదటి ప్రైజ్ రాగానే, బహుమతి అందజేస్తూ... డా॥కె.వి.రమణాచారి IAS (రి)గారు, 'లంచగొండి' గురించి వేసిన ఆ కార్టూన్‌ని ఎంతగానో మెచ్చుకోవడమే కాకుండా, కార్టూనిస్టుల అనేక సభల్లో ఆ కార్టూన్‌ని గుర్తు చేస్తూ వీరిని పదే పదే అభినందించడం మరిచిపోలేని అనుభవం అంటారు.


శ్రీప్రసిద్ధ గారు మరిన్ని మంచి మంచి కార్టూన్లు వేస్తూ తెలుగు కార్టూన్ ప్రపంచంలో మరింతగా రాణించాలని హాస్యానందం కోరుకుంటోంది.



















'ఓటు అమ్ముకోవద్దు'
ఓటుహక్కుపై జనచైతన్య కార్యక్రమం
కనీసం బిర్యానీ ప్యాకెట్టయినా ఇస్తేనే జనాలు మీటింగ్‌కి వస్తామంటున్నారు సార్!



నేను ఎన్నో నెంబరు పిల్లరు దగ్గర ఉన్నానో చెప్పడానికి ఇదేమన్నా ఫ్లైఓవర్ అనుకున్నావా?.. వేయి స్తంభాల గుడి..



మీ నాన్నగారికి పునర్జన్మపై బాగా నమ్మకముంది బాబూ! తన యావదాస్తి తనకే ఉండేట్లు వీలునామా రాయించాడు..
WILL
LAWYER


అతనికి బెయిల్ దొరికిందట!
మా నాయకుడు నీతి పరుడు
న్యాయం గెలిచింది
జిందాబాద్


వానల కోసం వాళ్లెవరో బలవంతంగా మాకు పెళ్లి చేసారు! పరువేం పోలేదు.. దీవించు నాన్నా!!


ముగ్గులేయడం వచ్చా అని ఏదో మాటవరసకు అడిగానమ్మాయ్..


అంకుల్! ఏదన్నా స్తంభం దగ్గర ఆపితే, మేము దిగి, పాస్ పోసుకొని వచ్చేస్తాం..
DOG CATCHING VAN
కుక్కల బండి


గుర్తుపట్టావా? మెడికల్ కోర్సుకి మనకి ఎడ్యుకేషన్ లోన్ సాంక్షన్ చేయకుండా సతాయించిన బ్యాంకు మేనేజరితనేరా..




డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, కె.బి.ఎన్.కళాశాల, విజయవాడ
90320 44115

**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

(గత సంచిక తరువాయి)

**"రో**జూ తెల్లవారు జామునే ఎవరో మన వాకిలిముందు తచ్చాడుతున్నట్లు, గోడ మీద నుంచి చూస్తున్నట్లు అనిపిస్తోందండీ. కల కాదు... నిజంగానే... తెల్లవారు జామున ఐదుగంటల సమయంలో ముగ్గు వేయటానికి వెళ్తానా..."

ఒక్కోసారి అప్పటికే ఎవరో చూస్తుంటారు. నేను గేటు దగ్గరకు వచ్చేసరికి మాయం అవుతారు. ఒక్కోసారి నేను ముగ్గు వేసి తిరిగి వచ్చే సమయానికి వస్తారు. గోడ మీద నుంచి తొంగి తొంగి చూస్తారు. నాకు ఏమిటోగా ఉంటోందండీ..." అంటూ మళ్ళీ వంకరలు పోయింది.

అదీ...అసలు విషయం. రహస్యం తెలిసింది. రత్నం పోతున్న వంకరలకు అర్థం అర్థమైంది. జ్ఞాన నేత్రం విచ్చుకుంది. ఇక మొదలు పెట్టా....

"రత్నం! వాడేదో తెలిసో తెలియకో తిరిగాడనుకుందాం. వాడి సౌందర్య ప్రియత్వం ఇంతవరకే పరిమితం అనుకుందాం. అయినా... ఆ మాత్రం గోడ మీద నుంచి చూసినందుకే ఏమైందని?... దారిన పోయేవాళ్ళు వందమంది చూస్తుంటారు. ప్రతిదీ పట్టించుకోకూడదు రత్నం. ప్రతి చూపులోనూ మన అందం గురించి వెతక్కూడదు!" అంటూ భగవద్గీత బోధిస్తున్న కృష్ణ పరమాత్మ తీరులో భంగిమ పెట్టా.

"అబ్బా! ప్రతిదీ మీకు వెటకారంగానే ఉంటుంది... నేను తెలుగు మాస్టారి భార్యని. ఆ మాత్రం శ్లేష నాకూ అర్థమవుతుంది." అంది రత్నం.

రత్నానికి తెలుగు అర్థమవుతోందన్న ఆనందం ఓ పక్కన, వ్యంగ్యం అర్థమైందన్న భావన మరో పక్కన నన్ను ఉక్కిరిబిక్కిరి చేసాయి.


"సరే కానీ... ఇప్పుడేం చేద్దామో నువ్వే చెప్పు!" అంటూ తననే అడిగా.

"అదీ అలా రండి దారికి." విజయగర్వం ప్రకటించింది రత్నం.

"రేపు ఉదయం లేవగానే మీరు పూజలు గట్రా అంటూ దేముడి గదిలో కూర్చోకుండా నాతో పాటు ఉండండి. నేను ఆ దొంగవాడితో మాట కలుపుతా! మీరు వాడిని పట్టుకోండి" అంటూ డిటెక్టివ్ తరహాలో ప్రణాళిక వేసింది రత్నం.

సరే.... అనటం తప్ప ఆ క్షణానికి మరో మార్గం లేదు.

✦✦✦




'అమ్మనుడి అటకెక్కేనా!' సౌజన్యంతో

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. రత్నం ఆ దొంగచూపుల వాడితో ఏదో మాట్లాడుతోంది.

తను సైగ చెయ్యగానే వాకిట్లోకి వచ్చా.

అంతే నన్ను చూడటంతోనే ఆ దొంగలచూపుల వాడు నిలువెల్లా వణికి పోయాడు.

"సారూ! క్షమించండి. ఈ పేపరుకు నాకూ ఏ సంబంధం లేదు. అయ్యా! కాపాడండి. ఇవాల్టితో ఉద్యోగం మానేస్తాను... సార్! మళ్ళీ తప్పులని, వ్యాకరణం అనీ క్లాసు పీకద్దు. పరకడుపున

తట్టుకోలేను మహాప్రభో! చిన్నజీతగాడిని కావడంతో పేపరు వేసే పని ఒప్పుకున్నాను. అప్పటికీ మీ చూపు తగలకూడదనే ఇలా గోడ మీద నుంచి చూసి మరీ పేపరు వేస్తున్నాను. ఈ తల్లి దయ వల్ల మళ్ళీ మీకు దొరికాను. నన్ను వదిలెయ్యండి మహానుభావా!" అంటూ అనేకవిధాలుగా ప్రాధేయపడుతున్నాడు.

రత్నానికి విషయం అర్ధమైంది.


ఆఖరుకి పేపరు వేసేవాడిని కూడా వదల్లేదన్న మాట మీరు! మీ తెలుగు చాదస్తం. మీ తెలుగు ప్రేమతో అందరి ప్రాణాలు తీస్తున్నారు కదండి!పాలవాడు, పనిమనిషి, పేపరువాడు... ఏ ఒక్కరినీ వదలరా అంటూ దండకం ప్రారంభించింది రత్నం.

పేపరువాడు దొంగచూపులు చూసింది నా బాధ తట్టుకోలేకే కానీ తన సౌందర్యాన్ని చూసి కాదన్న విషయం అర్ధమైన ఉక్రోషం ఆ మాటల్లో చాలా స్పష్టంగా అర్ధమైంది.

"అసలేం జరిగిందో చెప్పు..." అంటూ దొంగచూపుల వాడిని చొక్కా పట్టుకుని మరీ నిలదీసింది రత్నం.

"అమ్మా! చొక్కా వదలండి. కొత్త చొక్కా కొనుక్కోలేని పేద వాడిని. చెబుతాను తల్లీ..." అంటూ ప్రారంభించాడు.

"ఆ రోజు ఎప్పటిలాగే పేపరు వెయ్యటానికి వచ్చాను. తమరు ఇంట్లో లేరో ఏమో కానీ... అయ్యగారు అప్పటికే వాకిలి అరుగు మీద కూర్చున్నారు. మనిషి ఉన్నారు కదా అని




పేపరు చేతికిచ్చాను. వీధి చివరి దాకా వెళ్ళి తిరిగివస్తుంటే అయ్యగారు పిలిచారు... ఆ భయంకరమైన ఘటన కలలో కూడా మర్చిపోలేను తల్లీ... చెబుతాను...

ఏమయ్యా! పేపరు చదివావా అన్నారు. లేదు మాస్టారూ అన్నా. ఇదిగో రావయ్యా... ఇద్దరం కలిసి చదువుదాం అంటూ ఆప్యాయంగా పిలిచారు.

అప్పటికే పేపరు వెయ్యటం అయిపోవటంతో నేనూ కాస్త సేద తీరుదామని అయ్యగారి పక్కన కూర్చున్నా.

ఇక మొదలైంది తల్లీ...

ఇదిగోనయ్యా! మంత్రి గారు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసారు... అని రాసారు. **పంపిణీ** అని రాయకూడదయ్యా. **పంపిణి** అని మాత్రమే రాయాలి. ణ కి దీర్ఘం పెట్టకూడదు.


ఇదిగో ఈ వార్త చూడు... సన్మానంలో భాగంగా **శాలువా** కప్పారు అని రాసారు... ఏమిటయ్యా వీళ్ళ భాష! **శాలువ** అని మాత్రమే రాయాలి. ఇంకోచోట నీటి **తీరువా** వసూలు అని రాసారు... నీటి **తీరువ** అని మాత్రమే రాయాలి. **చెండాలము, చెరించు** అనే పదాలు కూడా పత్రికల్లో తరచుగా కనిపిస్తాయి... **చండాలము,చరించు** అని మాత్రమే రాయాలి.

ఈ మాత్రం పరిజ్ఞానం లేకుండా పత్రికల్లో ఎలా పనిచేస్తారయ్యా! వార్తలు రాయాలంటే కనీసంగా అయినా భాషాజ్ఞానం ఉండక్కర్లేదా అంటా. ఇలాంటి వాళ్ళని పత్రికల్లో ఉద్యోగాలకు ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నిస్తున్నా!" అంటూ అయ్యగారు అరగంటకు పైగా క్లాసు పీకారు తల్లీ.

అక్కడితో ఆగారా అంటే... అదీ లేదు తల్లీ!


ఓ వార్త శీర్షికలో సమాజ సేవకు అంకూరార్పణ అని ఉందట. **అంకురము, అంకూరము** అనే పదాలు ఉన్నాయి. కానీ **అంకూరార్పణము** ఏమిటంటూ గర్జించారు.

నాకు తెలియదంటే ఊరుకోలేదు తల్లీ. **అంకురార్పణము** అనే రాయాలి. లేకపోతే, **అంకురారోపణము** అని కూడా రాయవచ్చుట. ఈ విషయం ఆఫీసులో కూడా చెప్పమన్నారు తల్లీ. **(అతని బాధ సశేషం)**



VISAKHAPATNAM

# కార్టూన్ పోటీ ఫలితాలు




క్రోధినామసంవత్సర ఉగాది సందర్భంగా **యన్.సి.సి.యఫ్** వారు నిర్వహించిన పోటీకి 72 మంది కార్టూనిస్టుల నుండి 194 కార్టూన్లు అందాయి.


వీటిలో బహుమతులకు అర్హమైన కార్టూన్లను న్యాయనిర్ణేతగా వ్యవహరించిన సీనియర్ కార్టూనిస్టు శ్రీ బి.యస్.రాజు గారు మరియు నిర్వాహకులబృందం కలిసి ఎంపికచేయడం జరిగినది.


**5 కార్టూన్లకు 1000 రూపాయలు చొప్పున మరియు 35 కార్టూన్లకు 200 రూపాయలు చొప్పున** బహుమతులు ఇవ్వటం జరుగుతుంది. ఈ పోటీలో పాల్గొన్న కార్టూనిస్టులందరికీ మా ధన్యవాదాలు.


ఈ పోటీ నిర్వహణకు తోడ్పాటు అందించిన హాస్యానందం పత్రిక యాజమాన్యానికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.


**-టి.ఆర్.బాబు, శర్మ, లాల్**
**విశాఖపట్టణం**

## 1000 రూపాయలు చొప్పున బహుమతులు పొందిన కార్టూన్లు 5













## ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు














# ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు
























# ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు
































# ప్రత్యేక జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు
























**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డ బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు, చందుని ఇష్టపడుతుంది. ఒక వజ్రాల నగ కోసం ఇందుని సుబ్బు కిడ్నాప్ చేసాడన్న విషయం తెలిసి అతని గురించి వాకాబు చేస్తుంటారు ఇందు, చందు, రామం, రచన. **ఇప్పుడు...**

**"ఆ సుబ్బు గాడు, వాడి ఫ్లాట్‌కి వచ్చాడు!" అంది ఇందు బైనాక్యులర్స్‌లో చూస్తూ...**

**అందరూ అలర్ట్ అయ్యారు.**

**"లైట్ వేసాడు!" అంది. కాస్త ఆగి... "షూ విప్పుతున్నాడు!" అంది.**

**తర్వాత... "బాత్ రూంకు వెళుతున్నాడు!'అంది.**

**"అబ్బా!... చెంబుపట్టుకొని, గట్టుకు వెళ్ళి కూర్చుంటున్నాడు! గడ్డి పీకుతున్నాడు..." ఇలాంటివన్నీ రన్నింగ్ కామెంట్రీ ఇవ్వకు. ఏదైనా, మనకు కావలసినంత ఆసక్తికరంగా ఉంటే... అది మాత్రం చెప్పు!" అన్నాడు చందు.**

**ఇందు నవ్వి... మౌనంగా పరిశీలించసాగింది.**

**"రామం! ఆ గిల్ట్ నగలో, జీపిఎస్ లాంటిది ఏమైనా పెట్టిద్దామా? వీడు ఎక్కడికి వెళుతున్నాడో... అబ్జర్వ్ చేసి, ఆ తర్వాత పోలీసులకు పట్టించవచ్చు!" అన్నాడు చందు.**

**"ఆ సుబ్బుగాడు అసలే వెధవ! సో, వాడు చాలా ఈజీగా గెస్ చేసి మరీ ఆ జీపీఎస్ ఉందేమో అని చెక్ చేస్తాడు! సో... వద్దు!" అన్నాడు రామం.**

"క్లైమాక్స్‌లో ఫైటింగ్ లేదా? ఆ సుబ్బుగాడిని పట్టుకొని, మూతిపళ్ళు రాలగొట్టాలి. లేదంటే ఇట్లనే కిడ్నాపులు చేయిస్తూ, బెదిరిస్తాడు!" అంది రచన.

"ఏంటి ఫైటింగా? వాడు సాఫ్ట్‌వేర్ ఇంజనియర్! నేను లాయర్‌ను. ఫైటింగులు మాకు చేత కావు!" అన్నాడు రామం.

"వేస్ట్! అసలు హీరోలు అంటే ఎట్లుండాలె! లాయర్ వేషం కట్టినా, డాక్టర్ వేషం కట్టినా, ఆఖరకు ముఖ్యమంత్రి వేషం కట్టినా...ఫైటింగ్ చెయ్యాలె!... లేకపోతే... విలన్లకు బుద్ధి ఎట్లా వస్తాది?" అంది రచన.

"విలన్లకు బుద్ధి రావాలంటే... మాకు చేతకాని ఫైటింగులే చేయనక్కర్లేదు... మాకు

బ్రెయిన్స్ ఉన్నాయి. ఏం చేయాలో చేస్తాం! తొందరపడకు!" అన్నాడు రామం.

రచన ఏదో అనబోయే లోపు... ఇందు–

"ఏయ్! ఆ సుబ్బుగాడు, ఒక సూట్ కేసులో, డబ్బు, ఏవో సర్టిఫికెట్లు, బట్టలు సర్దుకుంటు న్నాడు!" అంది.

"ఓహో! ఆ నగ చేతుల్లో పడగానే, ఎక్కడికో చెక్కేసే ప్లాన్‌లో ఉన్నాడన్నమాట!" అన్నాడు చందు.

"ఊహించిందే!" అన్నాడు రామం.

"వాడు ఇంటి నుండి వెళ్లిపోతే మళ్ళీ వాడిని ట్రేస్ చెయ్యడానికి మనం ఉరుకులూ పరుగులూ పెట్టాలి! రాఘవరావు గారు న్యూయార్క్ నుంచి వచ్చేవరకు సుబ్బుగాడిని... వాడి ఇంట్లోనే ఉండేలా ఆపాలి! అనుకున్న ప్లాన్ అమలు చేసేద్దాం!" అన్నాడు రామం.

రామం, తనకు బాగా తెలిసిన పోలీసుకు ఫోన్ చేసి– "మీ పని కానివ్వండి!" అన్నాడు.

అప్పటి దాకా, సుబ్బు ఫ్లాట్‌కు కాస్త దగ్గరలో కారులో వెయిట్ చేస్తున్న, అమెరికన్ పోలీస్... సుబ్బు ఫ్లాట్ ముందుకు వెళ్ళి, బెల్ కొట్టాడు.

సుబ్బు తలుపు తెరిచి పోలీసును చూసి... గతుక్కుమని.. వెంటనే తమాయించుకొని–

"ఏంటి!?" అన్నాడు.

"మీ పేరు సుబ్బునా!?"


"అవును! అయితే?"

"కొంత సమాచారం కావాలి... తలుపు తెరుస్తారా?" అన్నాడు పోలీస్.

## ఈ నెల 'దినం'



ప్రపంచ మలేరియా దినం -ఏప్రిల్,25




"నేను అర్జంటుగా బయటకు వెళ్ళాలి!..." అన్నాడు సుబ్బు.

"వెళ్లండి! నేనేం ఆపను. కాస్త సమాచారం కావాలి. ఇచ్చేసి వెళ్ళిపోండి!" అన్నాడు పోలీస్.

సుబ్బు, విధిలేక పోలీసును లోపలికి ఆహ్వానించాడు.

"కాస్త కాఫీ దొరుకుతుందా?..." అన్నాడు పోలీసు కూర్చుంటూ.

'కాఫీ కావాలంటే బయట షాపులో తాగి రావొచ్చు కదా!... ఏంటీ కక్కుర్తి!' మనసులో అనుకుంటూ..."హిహిహిహి! ష్యూర్..ష్యూర్!" అని కిచెన్‌లోకి వెళ్ళి కాఫీ పెట్టి తీసుకొచ్చి ఇచ్చాడు.

పోలీసు, కాఫీ తాగుతూ, "ఎక్కడికో లాంగ్ జర్నీకి వెళుతున్నట్లున్నారు!"అన్నాడు, సోఫా మీదున్న సూట్ కేసును చూస్తూ.

సుబ్బు నీళ్ళు నములుతూ, "యా... యా... వాషింగ్టన్ నగరానికి వెళ్తున్నాను!... జస్ట్ ఫర్ ఎంజాయ్మెంట్!" అన్నాడు.

"ఓహ్! వాషింగ్టన్‌లో ఎక్కడికి?" అడిగాడు పోలీస్, క్యాజువల్‌గా.


"ఏ..ఎందుకు?" అన్నాడు.

"అబ్బే ఏం లేదు... నేను పెరిగింది వాషింగ్టన్లోనే! అందుకే అడిగాను!" అన్నాడు పోలీస్.

"వెళ్లి...ఏదైనా హోటల్‌లో దిగి... అక్కడి నుండి కొన్ని ప్లేసెస్ తిరుగుతాను...జస్ట్ అలా సరదాగా!" అన్నాడు సుబ్బు.

"ఓహ్! హోటల్ బుక్ చేసుకోకుండానే వెళుతున్నారా? స్ట్రేంజ్!" అన్నాడు పోలీస్.

"ఇంతకూ... మీకేం సమాచారాం కావాలో చెప్పలేదు సర్?" అన్నాడు సుబ్బు, కోపాన్ని, చిరాకునూ అణుచుకుంటూ.



"మీరు అంతకు ముందు ఓసారి... ఒక అమ్మాయితో, కరీబియన్ ద్వీపాలకు జాలీ ట్రిప్ కోసం వెళ్ళారు కదూ..!"

సుబ్బు నీళ్లు నములుతూ...

"అయితే!" అన్నాడు.

"ఆమె మీ భార్యా?"

"క...కాదు!"

"ఓ... ఓకే! తినడానికి ఏమైనా ఉందా?" అడిగాడు పోలీస్.

సుబ్బు, కిచెన్‌లోకి వెళ్ళి... ఫ్రిజ్‌లో ఉన్న బిస్కెట్ ప్యాకెట్ తీసుకొచ్చి, పోలీసు ముందు పెట్టాడు.

పోలీస్, మూడు బిస్కెట్లు ఒకేసారి నోట్లో పెట్టుకొని, పరపరా నములుతూ–

"ఆ అమ్మాయిని నిన్న రాత్రి, ఎవరో హత్య చేసారు!... మాకు కొన్ని వివరాలు కావాలి!" అన్నాడు పోలీస్ కూల్‌గా!

సుబ్బు సోఫాలో కూలబడిపోయి...

"చెప్పండి! ఏం కావాలి?" అన్నాడు.

"ఆ అమ్మాయి మీకు ఎలా పరిచయం?..." అడిగాడు పోలీస్ ఆఫీసర్.

"ఒక పార్టీలో పరిచయం అయ్యింది!..." సుబ్బు నీరసంగా చెప్పాడు.

"ఓ! ఇద్దరు జాలీ ట్రిప్ కోసం కరీబియన్ ఐలాండ్స్‌కు వెళ్ళారా?"

"నో...నో... నో..!"అన్నాడు సుబ్బు నీళ్ళు నములుతూ.

"మరి? అమెరికాలో మీ ఆంధ్రా ఆవకాయ ఎలా అమ్మాలో... డిస్కస్ చెయ్యడం కోసం, ఇద్దరూ కలిసి అలా వెళ్ళారా?" అన్నాడు పోలీస్ వెటకారంగా.

"అబ్బే కాదు! ఇద్దరం, ఒకరిని ఒకరం అర్థం చేసుకుందాం అని...."

"అంటే? డేటింగా?..." అన్నాడు పోలీస్.

"అబ్బే... కాదు!"

"ఆ అమ్మాయినెవరు చంపేసి ఉండొచ్చు?" అన్నాడు పోలీస్.

"నాకెలా తెలుస్తుంది?" అన్నాడు సుబ్బు.

"ఇంట్లో తినడానికి ఏమైన ఉందా?" బాగా ఆకలిగా ఉంది!..." అన్నాడు పోలీస్.

'ఒరేయ్! ఇప్పుడే కదరా...లోటెడు కాఫీని నీ డ్రమ్ము లాంటి కడుపులో పోసావ్!... అర డజను బిస్కట్లు కరకర మింగావ్!... అప్పుడే ఆకలేంట్రా!' మనసులో అనుకున్నాడు సుబ్బు.

"లేదు!" అన్నాడు సుబ్బు, వీలైనంత తొంద రగా వదిలించుకోవాలనే ఉద్దేశ్యంతో.


"అదేంటి?... మీ ఇండియన్స్‌కు ఇంట్లోనే వండుకుని తినే అలవాటు ఉంటుంది కదా?... ఇంట్లో ఏమీ లేకుండా ఎలా ఉంటుంది?"

"బ్యాచిలర్‌ను కదా! బయటి నుంచి తెప్పిం చుకుని తినడం అలవాటు!" అన్నాడు సుబ్బు.

"అయితే... నేను పిజ్జా ఆర్డర్ చేస్తాను!... తిందాం! ఆ తర్వాత ప్రశ్నలు అడుగుతాను!" అన్నాడు పోలీస్.

సుబ్బు తన జుట్టు తాను పీక్కోలేక, కోపాన్ని దిగమింగుకున్నాడు.

డామినోస్ పిజ్జా వాడైతే అరగంటలో వస్తాడు. అందుకని, పోలీస్, బాగా దూరంగా ఉండే ఓ ఇటాలియన్ పిజ్జా షాప్‌ను ఎన్నుకొని మరీ పిజ్జా ఆర్డర్ పెట్టి, టీవి చూస్తూ కూర్చు న్నాడు. **(సశేషం)**



# పదానందం -9



కూర్పు: పోపూరి విశ్వనాథ్, 9133197111

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | | 3 | |
| | | | 4 | | 5 | | |
| | | 6 | | | | | 7 |
| 8 | 9 | | 10 | | | 11 | |
| | | | | | 12 | | |
| | | | | | 13 | 14 | |
| 15 | | 16 | | 17 | | | |
| | | | | 18 | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. రోతతో కూడిన ద్వేషం (4)
3. తోక తెగిన జామాత (2)
4. తిరగబడ్డ విసుర్రాయి (4)
8. ఈ కాయలు ఒక ఆట (5)
11. నక్షత్రం (2)
13. .......... ..కోరికలు అని సామెత (3)
15. ప్రతిదానికీ తగవులు పెట్టుకునేవాడు (5)
18. ఉత్తరాంధ్రలోని ఒక నది (4)

**నిలువు**

1. తేనెటీగ లాంటిది (4)
2. దీని మీద పుట్ర అని సామెత (2)
3. ఏ విషయంలోనూ ఇది పనికి రాదు (2)
5. అనురాగం, రసకందాయం (2)
6. జబ్బులు రాకుండా వేసేది (2)
7. ఈ అమ్మ చిక్కినా అందమే (4)
9. ఒక గుర్తింపు మచ్చ తలకిందులైంది (4)
10. ప్రభువు, స్వంతదారు సరిగా లేదు (4)
12. మూల, చిన్నసందు కింది నుండి (2)
14. ధైర్యం (3)
15. తంత్రం, కార్యక్రమం (2)
16. సిగ్గు (2)
17. తిరగబడిన మహిళ (2)

సమాధానం వచ్చే సంచికలో...

**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మొ | హ | 2 మా | టం | | 3 ఆ | | |
| ట్టి | | ట | | 4 ప | దా | ప | 5 ది |
| 6 కా | టి | కా | ప | రి | | | ల |
| య | | రి | | చ | | 7 స్న | పె |
| | 8 అ | | 9 ని | యం | 10 త | | ట |
| | 11 రి | కొ | ట్ట | | 12 థ్యం | 13 తి | ఆ |
| 14 వా | టా | | 15 రం | 16 గం | | డ | |
| | 17 కు | ళ్ళ | | 18 ప | ట | ప | ట |



హాస్యానందం

చందాదారులుగా చేరండి!
నవ్వులానందంతో
ఆరోగ్యం పొందండి!

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

PRIYANKA PANDA
DESIGNER STUDIO







One stop shop for your designer wear



- Women
- Men
- Kids




Designing & Stitching



Call: +919959222411.
email: labelpriyankapanda@gmail.com

Hasyanandam April-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC

అందరికీ శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు!



చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

**Jaquar**

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548